Follow: @ANNTELUGU
01-02-2025
# మహా పత్రిక
ANN తెలుగు
శనివారం, హైదరాబాద్ | సంపుటి- 22 | సంచిక- 61 | పేజీలు-08 | వెల-రూ.6
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI   REGISTERED NUMBER: APTEL/2003/09316   WWW.EPAPER.MAHAADAILY.COM



## మూడు రెట్ల వేగంతో ఎన్డీఏ పాలన

### పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం

**ఉభయసభలను ఉద్దేశించి ప్రసంగించిన రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము**

**ఢిల్లీ, మహా :** పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ప్రారంభమైన నేపథ్యంలో ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ప్రసంగించారు. ఈ క్రమంలో ప్రయాగ్‌రాజ్‌లోని మహా కుంభమేళాలో జరిగిన తొక్కిసలాట ఘటనపై విచారం వ్యక్తం చేశారు రాష్ట్రపతి. బాధిత కుటుంబాలకు సంతాపం తెలియజేశారు. ఇటీవలే తుదిశ్వాస విడిచిన మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు నివాళులర్పించారు. ప్రయాగ్ రాజ్‌లో మహా కుంభమేళా జరుగుతున్న సమయంలో పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ప్రారంభమయ్యాయని ద్రౌపదీ ముర్ము వ్యాఖ్యానించారు. ఇటీవల రిపబ్లిక్ డే వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నామని పేర్కొన్నారు. బడ్జెట్‌లో రైతులు, మహిళలు, పేదలు, యువతకు ప్రాధాన్యత ఉంటుందని ఆమె వెల్లడించారు. మూడోసారి అధికారంలోకి వచ్చిన ఎన్డీయే సర్కారు గత ప్రభుత్వాల పాలనతో పోలిస్తే మూడు రెట్లు వేగంతో పనిచేస్తోందని కొనియాడారు. త్వరలో ప్రపంచంలో మూడో ఆర్థిక వ్యవస్థగా భారత్ మారనుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

**టాప్ న్యూస్**

## స్కిల్స్ కేపిటల్‌గా తెలంగాణ

- జిల్లా కేంద్రాల్లో ప్రత్యేక నైపుణ్య కేంద్రాలు
- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు



02

## గర్జనలు, గంభీరాలు గమనిస్తున్నాం

- ఫాంహౌజ్ కే పరిమితమా
- ఇంతకు ఆర్ అసెంబ్లీకి వస్తారా
- మంత్రి పొంగులేటి



02

## కేసీఆర్‌వి ఫాంహౌస్ కలలు

- స్థానిక సంస్థల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు కరువు
- పార్టీ ప్రతిష్ట కోసం పాకులాడుతున్న కేసీఆర్
- తీవ్ర స్థాయిలో మండిపడ్డ టీ పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్



03



## ఢిల్లీ ఎన్నికల వేళ

- అరవింద్ కేజ్రీవాల్‌కు బిగ్ షాక్
- ఏడుగురు ఆప్ ఎమ్మెల్యేలు రాజీనామా

మిగతా 2లో



## బీజేపీవి దిగజారుడు రాజకీయాలు

- సోనియా వ్యాఖ్యలను వక్రీకరిస్తున్నారు
- రాష్ట్రపతితో అన్ని అవాస్తవాలనే చెప్పించారు
- మండిపడ్డ మంత్రి సీతక్క

మిగతా 2లో



## సచిన్‌కు లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు

- ప్రకటించిన బీసీసీఐ
- ఈ పురస్కారాన్ని స్వీకరించనున్న 31వ ఆటగాడు సచిన్

మిగతా 2లో

# నేను కొడితే గట్టిగా కొడతా...

### మౌనంగా.. గంభీరంగా ఈ ప్రభుత్వాన్ని చూస్తున్నా

ప్రజలు అత్యాశకు పోయి కాంగ్రెస్‌కు ఓట్లేశారు.. తెలంగాణకు మంచి గుణపాఠమైంది
ఫిబ్రవరి చివరివారంలో భారీ బహిరంగసభ.. రాబోయే రోజుల్లో విజయం మనదే
కాంగ్రెసోళ్ళు పోల్ పెట్టినా.. మనల్నే జనం కోరుకుంటున్నారు
సంగమేశ్వర, బసవేశ్వర ప్రాజెక్టులపై.. భారీ దండయాత్ర చేయాలి
జహీరాబాద్ నేతల సమావేశంలో బిఆర్ఎస్ అధినేత కేసీఆర్

**మహా:** తాను కొడితే మామూలుగా ఉండదని ,గట్టిగా కొట్టడం తనకు ఉన్న అలవాటు అని మాజీ ముఖ్యమంత్రి, బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ అన్నారు. జహీరాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులతో ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో కేసీఆర్ సమావేశం అయ్యారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి హరీష్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ నేను గంభీరంగా, మౌనంగా ఈ ప్రభుత్వాన్ని చూస్తున్నా. కొడితే మామూలుగా కాదు గట్టిగా కొట్టడం నాకున్న అలవాటు ఫిబ్రవరి చివరిలో భారీ బహిరంగసభ నిర్వహిస్తాం. రాష్ట్రంలో ఎక్కడి ప్రాజెక్టులు అక్కడే పడుకున్నాయి. సంగమేశ్వరం, బసవేశ్వరం, కాళేశ్వరం ఎండబెడుతున్నారు. మన విజయం తెలంగాణ ప్రజల విజయం. రాబోయే రోజుల్లో విజయం మనదే. ప్రత్యక్ష పోరాటాలకు సిద్ధం కండి. తెలంగాణలో భూముల ధరలు అమాంతం పడిపోతున్నాయి. సంగమేశ్వర, బసవేశ్వర ప్రాజెక్ట్ టెండర్లను.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు ఆపింది. సంగమేశ్వర, బసవేశ్వర ప్రాజెక్టులపై.. భారీ దండయాత్ర చేయాలి. సంగమేశ్వర, బసవేశ్వర ప్రాజెక్టులకు నీళ్లు రావాలి. ఆలోచన లేకుండా ఎవడో ఏదో చెప్తే.. నమ్మి ఓటేస్తే తెలంగాణకు మంచి గుణపాఠం లభించింది.

మిగతా 3లో

### అసెంబ్లీ టైగర్ హరీష్

అసెంబ్లీ టైగర్ హరీష్ జిందాబాద్ అంటూ కేసీఆర్ మాట్లాడుతున్న సమయంలో కార్యకర్తలు నినాదాలు చేశారు. దీంతో కేసీఆర్ ఒక్కసారిగా మధ్యలో ప్రసంగం ఆపి నినాదాల తర్వాత కొనసాగించారు. హరీష్ నాయకత్వంలో సంగమేశ్వర, బసవేశ్వర రైతులు పోరాటాల్లో పాల్గొనాలన్నారు.




# దమ్ముంటే.. అసెంబ్లీకి రా

### ఫాంహౌస్‌లో ఉండి వచ్చినోళ్ళకు సోది చెప్పడం కాదు

**నీకు నిలబడే పరిస్థితే లేదు.. ఇక బలంగా కొట్టే దమ్ము ఉందా?**

- ధనిక రాష్ట్రాన్ని అప్పులకుప్ప చేశావ్
- గుమ్మికింద పందికొక్కులా పదేళ్ళు మెక్కావ్
- సోషల్ మీడియా లైకులతో ఆనందపడుతున్నావ్
- రాఖీసావంత్‌కు కూడా సల్మాన్ ఖాన్ కంటే ఎక్కువ లైకులొస్తాయ్
- గుండుసున్నా ఇచ్చినా.. కేసీఆర్‌కు బుద్ధిరాలే
- కేసీఆర్‌కు తెలంగాణ ప్రజలకు బంధం కట్ అయింది
- షాద్ నగర్ సభలో కేసీఆర్‌కు సీఎం రేవంత్ సవాల్

ప్రజలు ఓడించి ఫామ్‌హౌజ్‌కు పరిమితం చేసినా కేసీఆర్‌లో అహంకారం తగ్గలేదు. ఫాంహౌస్‌లో ఉండి వచ్చిన వారికి.. సోది చెప్పడం కాదు. దమ్ముంటే అసెంబ్లీకి రా. ప్రభుత్వం ఏం చేసిందో చెప్తాం. కేసీఆర్ సరిగ్గా నిలబడే పరిస్థితే లేదు. ఇక బలంగా కొట్టే దమ్ము ఉందా? అంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాజీ సీఎం కేసీఆర్ పై ఫైరయ్యారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చిన ప్రభుత్వం తమదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. దమ్ముంటే అసెంబ్లీకి వచ్చి ఈ అంశంపై చర్చించాలని సీఎం కేసీఆర్‌కి సవాల్ విసిరారు.

వివరాలు 2లో

## ఉస్మానియా కొత్త ఆస్పత్రికి సీఎం రేవంత్ రెడ్డి భూమి పూజ



- 26. 3 ఎకరాల్లో రూ.24 వేల కోట్లతో ప్రపంచస్థాయి ప్రమాణాలతో నిర్మాణం
- కొత్త ఆస్పత్రిలో రోబోటిక్ సర్జరీలకు ఓకే

03

### గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా

## నరేందర్ రెడ్డి

### ముందే చెప్పిన మహా

**హైదరాబాద్, మహా:** కరీంనగర్,నిజామాబాద్,ఆదిలాబాద్, మెదక్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థిగా ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత వి.నరేందర్ రెడ్డి ని ఖరారుచేశారు. ఈమేరకు శుక్రవారం రాత్రి ఎఐసిసి ప్రదానకార్యదర్శి కేసీ వేణుగోపాల్ అభ్యర్థిత్వ ప్రకటన చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా నరేందర్ రెడ్డిని ఖరారుచేసినట్లు మహా పత్రిక ముందుగానే చెప్పిన విషయం విదితమే. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాన్ని ఖచ్చితంగా గెలుచుకుంటామన్న ధీమాలో కాంగ్రెస్ నేతలు ఉన్నారు.


## దేశ జీడీపీ వృద్ధి 6.4 శాతం


### ఆర్థిక సర్వేలోని కీలక అంశాలివే

ఉభయసభల్లో ప్రవేశపెట్టిన ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్
పటిష్టంగా వ్యవసాయరంగం.. ఒత్తిడిలో తయారీరంగం..
స్థిరంగా ప్రైవేటు రంగ వినియోగం.. పురోగమిస్తున్న సేవారంగం

**ఢిల్లీ, మహా:** బడ్జెట్ సమర్పణకు ఒక రోజు ముందు ఆర్థిక సర్వేను ప్రవేశపెట్టడం ఆనవాయితీ కావడంతో 202425 సంవత్సరానికి సంబంధించిన ఆర్థిక సర్వేను ను ఆర్థిక మంత్రి శుక్రవారంనాడు ఉభయసభల్లో ప్రవేశపెట్టారు. దేశ ఆర్థిక వ్యవస్థ పనితీరు, రాబోయే కేంద్ర బడ్జెట్ అంచనాలను ఆర్థిక సర్వే హైలైట్ చేసింది.

మిగతా 2లో




## 3న బీజేపీ జిల్లా అధ్యక్షుల ప్రకటన

### కసరత్తు పూర్తిచేసిన బీజేపీ నాయకత్వం

- వచ్చే ఎన్నికలే లక్ష్యంగా అడుగులు
- రాష్ట్ర ఇన్ ఛార్జి సునిల్ బన్సల్, కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రక్రియ
- 25 జిల్లాలపై ఇప్పటికే ఏకాభిప్రాయం
- మరో వారం, పదిరోజుల్లో రాష్ట్రసారధి ఖరారు

వివరాలు 2లో

## తగిన సమయం అంటే ఎంత?

**శాసనసభ గడువు ముగిసేదాకా?**
**మహారాష్ట్ర తరహాలో చేద్దామనుకుంటున్నారా?**
**ఫిరాయింపులపై సుప్రీం ప్రశ్నలు**
**అసెంబ్లీ కార్యదర్శిపై సీరియస్**
వచ్చేవారం మళ్ళీ విచారణ.. మొదటిషాక్ దానం కేనా?

వివరాలు 4లో



# స్కిల్స్ కేపిటల్‌గా తెలంగాణ

## జిల్లా కేంద్రాల్లో ప్రత్యేక నైపుణ్య కేంద్రాలు.. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు



**హైదరాబాద్, మహా:** తెలంగాణను "స్కిల్స్ కేపిటల్ ఆఫ్ ది గ్లోబ్" గా తీర్చి దిద్దేందుకు జిల్లాలవారీగా ప్రత్యేక నైపుణ్య కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. శుక్రవారం జూబ్లీహిల్స్ లో "డార్క్ మేటర్ టెక్నాలజీస్" పేరిట కెనడాకు చెందిన "కన్సలేషన్ సాఫ్ట్ వేర్" ఏర్పాటు చేసిన గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ (జీసీసీ) ను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. "పరిశ్రమలు అభివృద్ధి చెందాలంటే నైపుణ్యమున్న మానవ వనరులు అవసరం. కంపెనీలు ఉద్యోగాల్లోకి తీసుకున్న తర్వాత తమ అవసరాలకు అనుగుణంగా శిక్షణ ఇస్తున్నాయి. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం చదువుకునే సమయంలోనే వారికి ప్రత్యేకంగా శిక్షణ ఇస్తున్నాం. చదువు పూర్తయ్యే నాటికి పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా వారిని తీర్చి దిద్దుతున్నాం. ఫలితంగా పరిశ్రమల డబ్బు, సమయం ఆదా అవుతుంది" అని ఈ సందర్భంగా మంత్రి వివరించారు. "మన దగ్గర టాలెంట్ కు కొదువ లేదు. తక్కువ పెట్టుబడితో అద్భుత ఆవిష్కరణలను చేసే సత్తా ఉంది. మరి ఎందుకు డీప్ సీక్ లాంటి అధునాతన ఆవిష్కరణలను చేయలేకపోతున్నాం. ఇప్పటికైనా హైదరాబాద్ లో ఉన్న పరిశ్రమలు ఈ అంశంపై దృష్టి సారించాలని కోరుతున్నా. తెలంగాణ యువత కూడా నైపుణ్యాలను పెంచుకోవాలి. ప్రభుత్వం తరపున మద్దతుగా ఉంటాం. మీకు ఉపాధి కల్పించే బాధ్యతను తీసుకుంటాం" అని వివరించారు. "జీసీసీలు భారత ఆర్థిక వ్యవస్థకు ఊతమిస్తున్నాయి. ఈ ఏడాది వాటి విలువ 46 బిలియన్ డాలర్లుగా ఉన్నట్లుగా ఆర్థికవేత్తలు పేర్కొంటున్నారు. వచ్చే ఏడాది 60 బి.డాలర్లు, 2030 నాటికి 100 బి.డాలర్ల మార్క్ దాటుతుందని అంచనా వేస్తున్నారు. అందుకే రాష్ట్ర ప్రభుత్వం జీసీసీల పై ప్రత్యేక దృష్టి సారించింది. తెలంగాణను ట్రిలియన్ ఎకానమీగా మార్చే లక్ష్యంలో వీటిని భాగస్వామ్యం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. హైదరాబాద్ ను జీసీసీల హబ్ గా మార్చేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే 400 జీసీసీలు ఇక్కడ కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. మరికొన్ని ప్రముఖ సంస్థలు ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నాయి" అని పేర్కొన్నారు. "బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఇన్సూరెన్స్ (బీఎఫ్ ఎస్ ఐ) కు చెందిన 5 జీసీసీలు హైదరాబాద్ లో ఉన్నాయి. ఈ రంగంలో 10 లక్షల మంది నిపుణులను తయారు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. బీఎఫ్ ఎస్ ఐ కన్సార్షియం సహకారంతో డిగ్రీ, ఇంజినీరింగ్ చదువుతున్న విద్యార్థులకు ద్వితీయ సంవత్సరం నుంచే సంబంధిత సబ్జెక్టులను బోధిస్తున్నాం. పట్టా చేతికి వచ్చే నాటికి వారంతా నిపుణులుగా తయారవుతారు. ఫలితంగా చదువు పూర్తయ్యే నాటికే ఉపాధి అవకాశాలు లభిస్తాయి" అని అన్నారు.

**పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తాం**

"ఎమర్జింగ్ టెక్నాలజీస్ లో కంపెనీలను స్థాపించేందుకు ముందుకొచ్చే పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తాం. త్వరలోనే క్వాంటమ్ కంప్యూటింగ్ కు సంబంధించిన సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్ ను ప్రారంభించబోతున్నాం. కెనడాకు చెందిన కన్సలేషన్ సాఫ్ట్ వేర్ లో వేయికి పైగా కంపెనీలున్నాయి. ఈ సంస్థ భారత్ లోనే తన మొదటి జీసీసీని హైదరాబాద్ లో డార్క్ మేటర్ టెక్నాలజీ పేరిట ప్రారంభించడం సంతోషదాయకం. ఈ సెంటర్ వల్ల 800 మందికి ఉపాధి కలుగుతుంది. భవిష్యత్తులో ఈ సంఖ్య 2వేలకు చేరుతుంది" అని అన్నారు. కార్యక్రమంలో కన్సలేషన్ సర్వీసెస్ (పెర్సస్ డివిజన్) ప్రెసిడెట్ స్కాట్ స్మిత్, డార్క్ మేటర్ టెక్నాలజీస్ సీఈవో, సీఆర్వో సీన్ డుగాన్, చీఫ్ రిస్క్ & ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ ఆఫీసర్ మైకేల్ హాక్, డార్క్ మేటర్ ఇండియా ప్రెసిడెంట్, ఎండీ రవి వర్మ తదితరులు పాల్గొన్నారు.


# దేశ జీడీపీ వృద్ధి 6.4 శాతం

(మొదటిపేజీ తరువాయి)

2026 ఆర్థిక సంవత్సరానికి భారత జీడీపీ వృద్ధి రేటు 6.3 నుంచి 6.8 శాతం వరకూ ఉంటుందని ఆర్థిక సర్వే అంచనా వేసింది. జూలైసెప్టెంబర్ త్రైమాసికంలో రియల్ టర్మ్స్‌లో భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధి రేటు 5.4గా నమోదైందని, ఇది ఆర్బీఐ అంచనా వేసిన 7 శాw నాలకు అందుకోలేదని తెలిపింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికంలో ఆహార ద్రవ్యోల్బణం తగ్గొచ్చని తెలిపింది. సీజనల్ వెజిటబుల్ ధరలు తగ్గడం, ఖరీఫ్ పంట రావడం కారణమని తెలిపింది. ఈ ప్రభావంతో 2026 తొలి ప్రథమార్థంలో కూడా ఆహార ధరలు అదుపులో ఉంటాయన అంచనా వేసింది. అయితే వాతావరణ పరిస్థితులు, అంతర్జాతీయ అగ్రికల్చరల్ ధరలు ద్రవ్యోల్బణంపై ప్రభావానికి అవకాశాలుంటాయని తెలిపింది. 202425 జాతీయ ఆదాయం డాటా దేశంలోని అన్ని రంగాలు పటిష్టంగానే ఉన్నాయని తెలిపింది. వ్యవసాయరంగం యథాప్రకారం పటిష్టంగా ఉందని, అన్ని ట్రెండ్ లెవెల్స్‌ను అధిగమించిందని తెలిపింది. పారిశ్రామిక రంగం సైతం కోవిడ్ మహమ్మారికి ముందున్న పరిస్థితిని అధిగమించి పురోగమిస్తోందని తెలిపింది. సేవారంగం పుంజుకుందన్నారు.

### అంతర్జాతీయ సవాళ్లు

గ్లోబల్ ఎనర్జీ, సరకుల ధరలు సాఫ్టెన్‌గా ఉండవచ్చని, అయితే అంతర్జాయ రాజకీయ, ఆర్థిక పరిస్థితుల నుంచి సవాళ్లు ఉండొచ్చని అంచనా వేసింది. భారత



విదేశీ మాదక ద్రవ్య నిల్వలు పటిష్టంగానే ఉన్నాయని తెలిపింది. జనవరి 2024కు నిల్వలు 616,7 బిలియన్ డాలర్లు ఉండగా, 2024 సెప్టెంబర్ నాటికి 704.9 బిలియన్ డాలర్లు ఉన్నాయని తెలిపింది. ఫార్మల్ ఎంప్లాయిమెట్ సెక్టార్‌లో గణనీయమైన ప్రగతి ఉన్నట్టు ఆర్థిక సర్వే తెలిపింది. నెట్ ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (ఈపీఎఫ్ఓ) సబ్‌స్క్రిప్షన్లు రెండింతలు పెరిగాయని తెలిపింది. 2019 ఆర్థిక సంవత్సరంలో ఉన్న 61 లక్షల సబ్‌స్క్రిప్షన్లు 2024 ఆర్థిక సంవత్సరానికి 131 లక్షలకు చేరినట్టు పేర్కొంది.

### ఆర్థిక సర్వేలోని ముఖ్యాంశాలివే

- 202425లో దేశ జీడీపీ వృద్ధి రేటు అంచనా 6.4శాతం
- 202526 ఆర్థిక సంవత్సరానికి గాను భారత వృద్ధి రేటు 6.36.8 శాతంగా ఉండొచ్చు.
- ప్రైవేటు రంగ వినియోగం స్థిరంగా ఉంది.
- వచ్చే ఏడాది ఆర్థిక పరిస్థితులు మందకొడిగా ఉంటాయని అంచనా
- రబీ పంట దిగుబడి బాగుంటే 2026 తొలి అర్ధ భాగంలో ఆహార పదార్థాల ధరలు తగ్గే అవకాశం ఉంది.
- ఖరీఫ్ పంట రావడం వల్ల ఆహార పదార్థాల ధరలు తగ్గాయి. దీంతో 202425 నాలుగో త్రైమాసికంలో ఆహార ద్రవ్యోల్బణం తగ్గొచ్చు.
- 202526 ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యోల్బణ భయాలు కాస్త తగ్గుముఖం పట్టొచ్చు. భౌగోళిక రాజకీయ అనిశ్చితుల రూపంలో ఇంకా ముప్పు పొంచి ఉంది.
- ప్రభుత్వ మూలధనం పెరగడం, వ్యాపార అంచనాలు మెరుగుపడటం వల్ల పెట్టుబడులు పుంజుకుంటాయని అంచనా.
- దేశీయంగా నెలకొన్న వాతావరణ పరిస్థితులు, అంతర్జాతీయంగా బలహీన డిమాండ్ నేపథ్యంలో గతేడాది తయారీ రంగం ఒత్తిడికి గురైంది.
- గత ఆర్థిక సంవత్సరంలో దేశంలో ఐపీఓ లిస్టింగ్‌లు గణనీయంగా నమోదయ్యాయి. ప్రపంచవ్యాప్తంగా ఐపీఓ లిస్టింగ్‌ల్లో మన వాటా 30శాతంగా ఉంది. 2023తో పోలిస్తే ఇది 17శాతం ఎక్కువ.

గత ఐదేళ్లలో మౌలిక సదుపాయాల కల్పనపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. దీని వల్ల భారీ మౌలికవసతుల రంగాల్లో కేంద్ర మూలధన వ్యయం 2020 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 38.8 శాతం పెరిగింది.

# బీజేపీవి దిగజారుడు రాజకీయాలు

- సోనియా గాంధీ వ్యాఖ్యలను వక్రీకరిస్తున్నారు
- రాష్ట్రపతితో అన్ని అవాస్తవాలనే చెప్పించారు
- మండిపడ్డ మంత్రి సీతక్క

**హైదరాబాద్, మహా:** కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత సోనియా గాంధీ వ్యాఖ్యలను బీజేపీ వక్రీకరిస్తోందని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క మండిపడ్డారు. అసలు సమస్యలను పక్కదారి పట్టించేలా లేని పోని వివాదాలు సృష్టించడం బీజేపీకి వెన్నతో పెట్టిన విద్య అని మంత్రి సీతక్క ఆగ్రహం వ్యక్తం చేసారు. రాష్ట్రపతి ప్రసంగంలో అన్ని అవాస్తవాలనే కేంద్ర ప్రభుత్వం చేర్పిందని సీతక్క ఫైర్ అయ్యారు. సామాన్యులను పూర్తిగా రాష్ట్రపతి ప్రసంగం విస్మరించిందని, నిరుద్యోగ సమస్య, ఆర్థిక రంగ ఒడి దుడుకులను రాష్ట్రపతి ప్రసంగంలో కనిపించలేదన్న విషయాన్ని కప్పిపుచ్చేందుకే సోనియా గాంధీ వ్యాఖ్యలపై వివాదం సృష్టిస్తున్నారని మండిపడ్డారు. ఆదివాసీ రాష్ట్రపతిని అవమానాల పాలు చేసేలా నరేంద్రమోడి నేతృత్వంలోని బీజేపీ వ్యవహరించిందని గుర్తు చేసారు. నూతన పార్లమెంటు భవన ప్రారంభోత్సవానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్మును ఆహ్వానించకుండా బీజేపీ తన కురుచ బుద్ధిని ప్రదర్శించిందని ఫైర్ అయ్యారు. ఆయోధ్య రామమందిర ప్రారంభోత్సవానికి రాష్ట్రపతిని ఎందుకు ఆహ్వానించలేదని ప్రశ్నించారు. ఆదివాసీలకు అడుగడునా అన్యాయం చేసి. ఇప్పుడు రాష్ట్రపతి అంశాన్ని అడ్డుపెట్టుకుని రాజకీయ పబ్బం గడుపుకుంటున్నారని విమర్శించారు. అటవీ హక్కు చట్టాన్ని నీరుగార్చి, ఏజెన్సీ ప్రాంతాల్లో ఇష్టారీతిన మైనింగ్ కు అనుమతులిస్తూ, పెసా చట్టాన్ని తుంగలో తొక్కిన బీజేపీ ఆదివాసీల గౌరవం గురించి మాట్లాడటం దయ్యాలు వేదాలు వల్లించడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివాసీల ప్రయోజనాలు కాదని, ఆదానీకి వంత పాడే బీజేపీ రాష్ట్రపతి పదవిని అడ్డుపెట్టుకుని దిగజారుడు రాజకీయాలు చేస్తుందని మంత్రి సీతక్క మండిపడ్డారు.

# 3న బీజేపీ జిల్లా అధ్యక్షుల ప్రకటన

## కసరత్తు పూర్తిచేసిన బీజేపీ నాయకత్వం

వచ్చే ఎన్నికలే లక్ష్యంగా అడుగులు

రాష్ట్ర ఇన్ ఛార్జి సునిల్ బన్సల్, కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రక్రియ

25జిల్లాలపై ఇప్పటికే ఏకాభిప్రాయం.. మరో వారం, పదిరోజుల్లో రాష్ట్రసారధి ఖరారు



**హైదరాబాద్, మహా:** బిజెపి జిల్లా అధ్యక్షుల నియామకంపై అధిష్టానం కసరత్తు దాదాపు పూర్తిచేసింది. తెలంగాణలో బిజెపికి 8 ఎమ్మెల్యే, 8 ఎంపీ లు , ఒక ఎమ్మెల్సీ ఉన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికలపై కన్నేసిన బిజెపి నాయకత్వం తెలంగాణ బీజేపీలో సంస్థాగత మార్పులకు శ్రీకారం చుట్టింది. పార్టీ బూత్, గ్రామ, మండల కమిటీల ఎన్నికలు పూర్తి చేసుకున్న రాష్ట్ర బీజేపీ నాయకత్వం జిల్లా కమిటీల అధ్యక్షుల ఎంపికపై దృష్టి సారించింది. మెజార్టీ జిల్లాల్లో అధ్యక్షుల ఎంపిక తతంగం అనధికారికంగా ఖరారైనప్పటికి.. కొన్ని జిల్లాల కమిటీల అధ్యక్ష పదవికి పలువురు నాయకులు పోటీ పడిన నేపథ్యంలో జిల్లా కమిటీ అధ్యక్షుల ఎంపికపై అధికార ప్రకటన వాయిదా వేసింది. జిల్లా అధ్యక్షుల ఎంపికపై ఏకాభిప్రాయ సాధనకు కసరత్తు చేసిన రాష్ట్ర నాయకత్వం ఇక అధ్యక్షుల ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాలని నిర్ణయించింది. దీనిపై రాష్ట్ర పార్టీ ఇంచార్జీ సునీల్ బన్సల్, ఎన్నికల పరిశీలకులు అరవింద మీనన్, రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్ రెడ్డిలు కేంద్ర నాయకత్వంతో చర్చించి జిల్లా అధ్యక్షుల ఎన్నికల ప్రక్రియ నిర్వహణకు సిద్ధమయ్యారు. ఆదివారం జిల్లాల అధ్యక్షుల ఎన్నికలపై ప్రకటన చేయనున్నట్లు తెలుస్తోంది. సగానికి పైగా జిల్లా అధ్యక్షులు ఖరారైతేనే రాష్ట్ర సారధిని నియమించాల్సి ఉండగా, ఇప్పటికే 25జిల్లాలపై నాయకత్వం ఏకాభిప్రాయానికి వచ్చినట్లు తెలుస్తోంది. మిగతా వాటిపై కూడా తుది కసరత్తు చేసి ఆదివారం ప్రకటన చేయనున్నట్లు తెలుస్తోంది.

**రాష్ట్ర అధ్యక్షుడి ప్రకటన పదిరోజుల్లో**

రాష్ట్ర పార్టీ అధ్యక్షుడిగా కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి స్థానంలో కొత్తగా బీసీ వర్గాలకు ఈ పదవి ఇవ్వాలని పార్టీ నాయకత్వం నిర్ణయించింది. అనేక చర్చల తరువాత... పార్టీ నాయకత్వం ఈటెల రాజేందర్ పేరు ఖరారు చేసినట్లు తెలుస్తోంది. ఈటలను రాష్ట్ర సారధి చేసేందుకే ఆయనను కేంద్ర కేబినెట్ లోకి తీసుకోలేదు. మరోవైపు ఎంపీలు ధర్మపురి అర్వింద్, రఘునందన్ రావు రాష్ట్ర అధ్యక్షపదవిపై ఫోకస్ పెట్టినట్లు తెలుస్తోంది. అనూహ్య పరిణామాలు సంభవిస్తే తప్ప ఈటల స్థానంలో మరొకరి పేరు పరిశీలన జరగదన్న చర్చ పార్టీ వర్గాల్లో ఉంది. ఇటీవల కిషన్ రెడ్డి కూడా మీడియాతో మాట్లాడిన సందర్భంలో ఈటల రాజేందర్ అధ్యక్షపదవి రేసులో ఉన్నాడని ప్రకటించారు. సాధారణంగా మాటలు అత్యంత పొదుపుగా వాడే కిషన్ రెడ్డి నోటినుండి ఈటల రాజేందర్ పేరు రావడంతో దీనిపై అత్యున్నత స్థాయిలో ఇప్పటికే నిర్ణయం జరిగిపోయినట్లుగా తెలుస్తోంది. జిల్లా అధ్యక్షులను ప్రకటించిన తర్వాత వారం, పదిరోజుల్లో రాష్ట్ర సారధిపై అధికారిక ప్రకటన రానుంది.

# ఢిల్లీ ఎన్నికల వేళ

## అరవింద్ కేజ్రీవాల్‌కు బిగ్ షాక్

### ఏడుగురు ఆప్ ఎమ్మెల్యేలు రాజీనామా

**ఢిల్లీ, మహా :** అసెంబ్లీ ఎన్నికలు మరో ఐదు రోజుల్లో జరగనున్న నేపథ్యంలో ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవల్ కు భారీ షాక్ తగిలింది. ఏడుగురు ఆప్ ఎమ్మెల్యేలు పార్టీకి రాజీనామా చేశారు. ఈ మేరకు అరవింద్ కేజ్రీవాల్‌కు లేఖలు పంపారు. రాజీమామా చేసిన వారిలో పాలెం ఎమ్మెల్యేలు భావనా గౌర్, జనక్‌పురి ఎమ్మెల్యే రాజేశ్ రిషి, కస్తూర్బానగర్ ఎమ్మెల్యే మదన్‌లాల్, త్రిలోక్‌పురి ఎమ్మెల్యే రోహిత్ మెహ్రౌలియా, ఆదర్శ్‌నగర్ ఎమ్మెల్యే పవన్ శర్మ, మెహ్రౌలి ఎమ్మెల్యే నరేశ్, బిజ్వాసన్ ఎమ్మెల్యే బీఎస్ జూన్ ఉన్నారు. ఆప్ పట్ల విశ్వాసం కోల్పోయామని అందువల్లే ఈ నిర్ణయం తీసుకున్నామని, తమ రాజీనామాను ఆమోదించండని కేజ్రీవాల్‌కు లేఖ రాశారు. అయితే ఈసారి ఆమ్ ఆద్మీ పార్టీ రాజీనామా చేసిన వారిలో ఎవ్వరికీ కూడా ఎమ్మెల్యే టికెట్ ఇవ్వలేదు. ఈ కారణంతోనే వాళ్లు రాజీనామా చేసినట్లు తెలుస్తోంది. ఇదిలాఉండగా, మూడోసారి అధికారంలోకి రావాలని ఆప్ ప్రచారాల్లో మునిగిపోయింది. ఓటర్లకు హామీల వర్షాలు కురిపిస్తోంది. ఇలాంటి సమయంలో ఆప్ నుంచి తాజాగా ఏడుగురు సిట్టింగ్ ఎమ్మెల్యేలు రాజీనామా చేయడం చర్చనీయాంశంగా మారింది. ఎమ్మెల్యేళ రాజీనామాలు ఎన్నికల ఫలితాలపై పడనుందన్న ప్రచారం కూడా జరుగుతోంది.


ఫిబ్రవరి 5న ఢిల్లీలో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న సంగతి తెలిసిందే. 8న ఓట్ల లెక్కింపు ఉంటుంది. ఈ ఎన్నికల్లో ఆప్, బీజేపీ, కాంగ్రెస్ మధ్య గట్టి పోటీ నెలకొంది. అయితే ఈసారి ఎవరు అధికారంలోకి వస్తారనేదానిపై దేశవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది. ఇప్పటికే బీజేపీ, ఆప్ హోరాహోరిగా తలపడుతున్నాయి. ప్రజలకు కూడా రెండు పార్టీలు భారీ తాయిలాలు ప్రకటించాయి. రెండు పార్టీల హామీలపై ఢిల్లీ ప్రజల్లో జోరుగా చర్చ జరుగుతున్న తరుణంలో ఆప్ కు భారీ షాక్ తగలడం గమనార్హం.

### లోక్ సభలో రాష్ట్రపతి ప్రసంగంపై

# సోనియా గాంధీ వ్యాఖ్యలు

## రాష్ట్రపతి భవన్ షాకింగ్ రియాక్షన్

### కాంగ్రెస్ ది జమిందారి మైండ్ సెట్ అన్న బీజేపీ



**ఢిల్లీ, మహా :** బడ్జెట్ సమావేశాల్లో భాగంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేసిన ప్రసంగంపై కాంగ్రెస్ అగ్ర నేత సోనియాగాంధీ వ్యాఖ్యలపై రాష్ట్రపతి కార్యాలయం స్పందించింది. దేశంలో అత్యున్నత వ్యక్తి గౌరవానికి భంగం కలిగేలా సోనియా ప్రవర్తించారంటూ మండి పడింది. ఇలా వ్యాఖ్యానించడం దురదృష్టకరమని అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ మేరకు తాజాగా ఓ ప్రకటనను విడుదల చేసింది. కాంగ్రెస్ నేతలు ఇలా మాట్లాడకుండా ఉండాల్సిందని తెలిపింది. రాష్ట్రపతి ప్రసంగం చేసేటప్పుడు అలసిపోయారని కాంగ్రెస్ నేతలు చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదు. ఆమె అలసిపోలేదు. అణగారిన వర్గాలు, రైతులు, మహిళల కోసం మాట్లాడేటప్పుడు ఆమెకు అలసట రాదు. రాష్ట్రపతి ప్రసంగంపై వ్యాఖ్యలు చేసిన వారికి భారతీయ భాష, యాసలతో పరిచయం ఉండకపోవచ్చు. అందుకే వాళ్లకు రాష్ట్రపతి అలసిపోయిట్లు అనిపించి ఉండొచ్చు. రాజ్యాంగబద్ధంగా అత్యున్నత స్థానంలో ఉన్నవారిపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ఆమోదయోగ్యం కాదని'' రాష్ట్రపతి భవన్ ఓ ప్రకటనలో రాసుకొచ్చింది.

**సోనియాగాంధీపై బీజేపీ ఆగ్రహం**

పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లో భాగంగా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఉభయ సభలనుద్దేశించి ప్రసంగించిన అనంతరంసంగతి తెలిసిందే. ప్రసంగం అనంతరం సోనియా గాంధీ మీడియాతో మాట్లాడుతూ, ప్రసంగం చివరికి వచ్చేసరికి రాష్ట్రపతి బాగా అలసిపోయారని, ఆమె మాట్లాడలేకపోయారని వ్యాఖ్యానించారు. సోనియా చేసిన ఈ వ్యాఖ్యలు వైరల్ అయాయి. దీంతో బీజేపీ సోనియాగాంధీపై ఆగ్రహం వ్యక్తం చేసింది. సోనియాగాంధీ, రాహుల్ గాంధీ వంటి నేతలు ఇలా మాట్లాడకూడదని బీజపీ ఎంపీ సుకంతా మజుందార్ మండిపడ్డారు. ముఖ్యంగా రాష్ట్రపతిని ఉద్దేశించే అలా మాట్లాడకూడదంటూ హితవు పలికారు. ఆదివాసి కుటుంబం నుంచి వచ్చి ద్రౌపతి ముర్ము రాష్ట్రపతిగా ఉన్నారని కాంగ్రెస్ పార్టీ జమిందారీ మైండ్‌సెట్ ఈ విషయాన్ని అంగీకరించడంలేదంటూ విమర్శించారు. అందుకే ముర్ము ప్రసంగాన్ని వాళ్లు వ్యతిరేకిస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.


# విలేకరులు కావలెను



మహా పత్రిక

మహా-తెలుగు దినపత్రికకు తెలంగాణలోని అన్ని జిల్లాల్లో

- స్టాఫ్ రిపోర్టర్లు,
- సబ్ ఎడిటర్లు,
- స్థానిక రిపోర్టర్లు
- మార్కెటింగ్ సిబ్బంది,
- సర్క్యులేషన్ సిబ్బంది కావలెను.

హైదరాబాద్‌లో స్టేట్ బ్యూరోకు రిపోర్టర్లు కావలెను

ఆసక్తి గల వారు
mahaapatrika@gmail.com కు లేదా,
9000141919 కు మీ రెజ్యూమ్‌లు పంపండి


# తగిన సమయం అంటే ఎంత?

## శాసనసభ గడువు ముగిసేదాకా?

### మహారాష్ట్ర తరహాలో చేద్దామనుకుంటున్నారా?

### ఫిరాయింపులపై సుప్రీం ప్రశ్నలు.. అసెంబ్లీ కార్యదర్శిపై సీరియస్

### వచ్చేవారం మళ్లీ విచారణ.. మొదటిషాక్ దానం కేనా?

**ఢిల్లీ, మహా:** ఎమ్మెల్యేల ఫిరాయింపులపై సుప్రీంలో హాట్ హాట్ చర్చ జరిగింది. సాధారణంగా కోర్టులో స్పీకర్ అధికారాల పరిధిలో మునుపెన్నడూ జోక్యం చేసుకోకపోగా, తాజాగా ఫిరాయింపులపై అనర్హత వేటువేయాలంటూ వేసిన పిటిషన్లపై శుక్రవారం సుప్రీంకోర్టు ధర్మాసనం విచారణ నిర్వహించింది. పార్టీ ఫిరాయింపులపై నాలుగు వారాల్లోగా స్పీకర్ నిర్ణయం తీసుకునేలా ఆదేశాలివ్వాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఎస్ఎల్‌పీ దాఖలు చేశారు. ఫిరాయించిన ఎమ్మెల్యేలకు స్పీకర్ ఇప్పటి దాకా కనీసం నోటీసులు కూడా ఇవ్వలేదని, ఫిరాయింపుల విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని ఇటీవలే హరీశ్ రావు సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై విచారించిన ధర్మాసనం అసెంబ్లీ కార్యదర్శిపై ఆగ్రహం వ్యక్తం చేసింది. నిర్ణయం తీసుకునేందుకు ఎంత సమయం కావాలంటూ ప్రశ్నించింది. అందుకు ప్రభుత్వం తరఫు లాయర్ ముకుల్ రోహత్గీ తగిన సమయం ఇవ్వాలంటూ కోర్టును అభ్యర్థించారు. అందుకు ధర్మాసనం మీ దృష్టిలో తగిన సమయం అంటే ఎంత? అంటూ ప్రశ్నించింది. రీజనబుల్ టైమ్ అంటే మహారాష్ట్ర తరహాలో శాసనసభ గడువు ముగిసే దాకా.. అని ఆగ్రహం వ్యక్తం చేసింది. అందుకు ప్రభుత్వం తరఫు లాయర్ ముకుల్ రోహత్గీ స్పందిస్తూ.. శాసనసభ స్పీకర్ ను అడిగి నిర్ణయాన్ని కోర్టుకు విన్నవిస్తామని బదులిచ్చారు. దీంతో తదుపరి విచారణను కోర్టు వచ్చే వారానికి వాయిదా వేసింది. మహారాష్ట్రలో ఫిరాయింపులపై మహాయుతి సర్కారు దాటవేస్తూ కాలం గడిపింది. శాసనసభ గడువుముగిసేదాకా.. నిర్ణయం తీసుకోలేదు.

### స్పీకర్ నిర్ణయమే ఫైనల్

అయితే స్పీకర్ ను నిర్ణయం తీసుకోమని చెప్పడం తప్ప ఏ నిర్ణయం తీసుకోవాలో న్యాయవ్యవస్థ చెప్పదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. గతంలో దరఖాస్తులను శాసనసభ కార్యదర్శికి అందించమని చెప్పిన ధర్మాసనం ఇపుడు కార్యదర్శికే ఆదేశాలు ఇస్తోంది. స్పీకర్ నిర్ణీత గడువును కోరి, తర్వాత దరఖాస్తులను తిరస్కరించే అవకాశాలు కూడా లేకపోలేదని చెబుతున్నారు. దానం విషయంలో మాత్రం ఎంపీగా పోటీచేసి ఉండడంతో షాక్ తప్పదని బిఆర్ఎస్ వర్గాలు విశ్వసిస్తున్నాయి.

# దమ్ముంటే.. అసెంబ్లీకి రా



## ఫాంహౌస్‌లో ఉండి వచ్చినోళ్ళకు సోది చెప్పడం కాదు

### నీకు నిలబడే పరిస్థితే లేదు.. ఇక బలంగా కొట్టే దమ్ము ఉందా?

- ధనిక రాష్ట్రాన్ని అప్పులకుప్ప చేశావ్
- గుమ్మికింద పందికొక్కులా పదేళ్ళు మెక్కావ్
- సోషల్ మీడియా లైకులతో ఆనందపడుతున్నావ్
- రాఖీసావంత్‌కు కూడా సల్మాన్ ఖాన్ కంటే ఎక్కువ లైకులొస్తాయ్
- గుండుసున్నా ఇచ్చినా.. కేసీఆర్‌కు బుద్ధిరాలే
- కేసీఆర్‌కు తెలంగాణ ప్రజలకు బంధం కట్ అయింది
- షాద్ నగర్ సభలో కేసీఆర్‌కు సీఎం రేవంత్ సవాల్

ప్రజలు ఓడించి ఫామ్‌హౌజ్‌కు పరిమితం చేసినా కేసీఆర్‌లో అహంకారం తగ్గలేదు. ఫాంహౌస్‌లో ఉండి వచ్చిన వారికి.. సోది చెప్పడం కాదు. దమ్ముంటే అసెంబ్లీకి రా. ప్రభుత్వం ఏం చేసిందో చెప్తాం. కేసీఆర్ సరిగ్గా నిలబడే పరిస్థితే లేదు. ఇక బలంగా కొట్టే దమ్ము ఉందా? అంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాజీ సీఎం కేసీఆర్ పై ఫైరయ్యారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చిన ప్రభుత్వం తమదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. దమ్ముంటే అసెంబ్లీకి వచ్చి ఈ అంశంపై చర్చించాలని సీఎం కేసీఆర్‌కి సవాల్ విసిరారు. మాజీ సీఎం కేసీఆర్ చేసిన వ్యాఖ్యలపై శుక్రవారం షాద్‌నగర్ సభలో సీఎం రేవంత్ రెడ్డి స్పందించారు. రుణమాఫీ చేయలేదంటున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తమ ప్రభుత్వంపై ఆరోపణలు గుప్పిస్తున్నారని.. ఆయన అసెంబ్లీకి వస్తే అందుకు సంబంధించిన లెక్కలు సైతం చెబుతానని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. కేసీఆర్ అప్పులు అప్పగించినా.. అధైర్య పడకుండా తాము పథకాలు అమలు చేస్తున్నామన్నారు. కేసీఆర్ పెట్టిన ఇబ్బందులకు గత సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు గుండు సున్నా ఓట్లు ఇచ్చారంటూ ఎద్దేవా చేశారు.

**గుమ్మికింద పందికొక్కుల్లా మింగారు**

ప్రజలు పదేళ్లు అధికారం ఇస్తే గుమ్మికింద పందికొక్కుల్లా మిగులు బడ్జెట్‌ను మింగేశారని సీఎం రేవంత్ ఆరోపించారు. అబద్ధాల వల్లనే గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిపోయిందని.. పార్లమెంట్ లో గుండు సున్నా వచ్చిందని ఎద్దేవా చేశారు. అయినా.. మళ్లీ ఫామ్‌హౌజ్‌లో ఉండి కాంగ్రెస్ ప్రభుత్వంపై అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. తమ ప్రభుత్వంలో అన్ని వర్గాలు సంతోషంగా ఉన్నాయని అన్నారు. రైతులకు రైతుభరోసా, విద్యార్థులకు ఫీజు రియింబర్స్‌మెంట్, రైతులకు ఉచిత కరెంట్, మహిళలకు ఫ్రీ బస్, రూ.500 గ్యాస్ సిలిండర్స్, యువతకు 50 వేల ఉద్యోగాలు ఇలా అనే పథకాలు విజయవంతంగా అమలు చేశామని.. బీఆర్ఎస్ హయాంలో లాగా రాష్ట్రాన్ని దోచుకోవడం లేదని అన్నారు. సోషల్ మీడియాలో వచ్చిన లైకులు చూసి కేసీఆర్ సంతోష పడుతున్నారని మండిపడ్డారు. రాఖీసావంత్‌కు కూడా టిక్‌టాక్‌లో లైకులు బాగానే వస్తాయని.. అదే మాదిరిగా బీఆర్ఎస్‌కు వచ్చాయని కౌంటర్ ఇచ్చారు. కేసీఆర్ కాలం చెల్లిన రూ.1000 నోటుతో సమానం అని.. ఆ నోటు దగ్గరుంటే జైలుకే తప్ప.. ఉపయోగం లేదని కీలక వ్యాఖ్యలు చేశారు.

**సంబంధాలు తెగిపోయాయి**

అధికారం పోగానే ఫామ్‌హౌజ్‌కు పరిమితం అయిన కేసీఆర్‌కు తెలంగాణ ప్రజలతో సంబంధాలు తెగిపోయాయని సీఎం రేవంత్ అన్నారు. "కేసీఆర్ సరిగ్గా నిలబడే పరిస్థితే లేదు. ఇక బలంగా కొట్టే దమ్ము ఉందా?" అని ఘాటు వ్యాఖ్యలు చేశారు. దమ్ముంటే అసెంబ్లీకి రావాలని సవాల్ చేశారు. గత ప్రభుత్వ హయాంలో టీచర్ నియామకాలు జరగలేదు. మా ప్రభుత్వం రాగానే 11వేల టీచర్ పోస్టులు భర్తీ చేశాం. గతంలో నోటిఫికేషన్లు ఇస్తే సంవత్సరాల తరబడి నియామక ప్రక్రియ జరిగేది. మా ప్రభుత్వం 55 రోజుల్లోనే డీఎస్సీ నియామక ప్రక్రియ పూర్తి చేసింది. గత ప్రభుత్వం వర్సిటీలను నిర్లక్ష్యం చేసింది. బీఆర్ఎస్ హయాంలో వర్సిటీలు పునరావాస కేంద్రాలుగా మారాయి. మా ప్రభుత్వం రాగానే వీసీలను నియమించాం. ప్రొఫెసర్ల పదవీ విరమణ వయసు 65 ఏళ్లకు పెంచాం. 21వేల మంది టీచర్లకు పదోన్నతులు కల్పించాం. ఎలాంటి వివాదం లేకుండా 35 వేల మంది ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ చేపట్టినట్లు తెలిపారు.

# నేను కొడితే గట్టిగా కొడతా...

## మౌనంగా.. గంభీరంగా ఈ ప్రభుత్వాన్ని చూస్తున్నా

- ప్రజలు అత్యాశకు పోయి కాంగ్రెస్‌కు ఓట్లేశారు..
- తెలంగాణకు మంచి గుణపాఠమైంది
- ఫిబ్రవరి చివరివారంలో భారీ బహిరంగసభ..
- రాబోయే రోజుల్లో విజయం మనదే
- కాంగ్రెసోళ్ళు పోల్ పెట్టినా.. మనల్నే జనం కోరుకుంటున్నారు
- సంగమేశ్వర, బసవేశ్వర ప్రాజెక్టులపై.. భారీ దండయాత్ర చేయాలి
- జహీరాబాద్ నేతల సమావేశంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్



(మొదటిపేజీ తరువాయి)

కైలాస ఆటలో పైకి వెళ్లాక పెద్ద పాము మింగినట్టు రాష్ట్ర పరిస్థితి అయింది. కరోనాలో కూడా రైతుబంధు ఇచ్చి.. రైతుల కోసం మంచి పథకాలను నేను అమలు చేస్తే అంతా గంగలో కలిసిపోయింది. గురుకుల హాస్టళ్లలో తిండి బాగా లేక.. పిల్లలు అనారోగ్యం బారినపడుతున్నారు. బీఆర్ఎస్ రాజకీయాల కోసం పుట్టింది కాదు. ఇక లాభంలేదు.. ప్రత్యక్ష పోరాటాలే. కాంగ్రెస్ పాలనలో రైతుబంధుకు రాంరాం. దళితబంధుకు జైభీమ్ చెప్పేశారు. తులం బంగారం పథకం గోవిందా. కాంగ్రెస్ పాలనపై అంతటా అసంతృప్తి. అన్నివర్గాలను ముంచిన పార్టీ కాంగ్రెస్. కైలాసం ఆటలో పెద్దపాము మింగినట్లైంది. గురుకులాల్లో చదువు అగమ్యగోచరం. మళ్లీ కరెంట్ కోతలు.. నీళ్ల వెతలు. పాలనా వైఫల్యాన్ని నిలదీస్తే కేసులా. కాంగ్రెస్ పాలనపై దండయాత్ర చేద్దాం. తెలంగాణలో ఏ ఒక్క పథకం సరిగ్గా అమలుకావడం లేదు. ఓట్ల కోసం కాంగ్రెస్ ముస్లింలను వాడుకుంది. సంగమేశ్వర, బసవేశ్వర ప్రాజెక్ట్ టెండర్లను.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు ఆపింది. టెండర్లు అడ్డుకోవడం వెనుక మతలబు ఏంటి. ప్రజలు ప్రశ్నిస్తే పోలీసులతో కేసులు పెట్టిస్తున్నారు" అని రేవంత్ ప్రభుత్వంపై కేసీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

**మంచి గుణపాఠం అయింది**

మాట్లాడితే ఫామ్ హౌస్, ఫామ్ హౌస్ అంటున్నారు.. అసలు ఫాంహౌస్‌లో పంటల తప్ప ఏం పండుతాయి అని ప్రశ్నించారు. నిన్న కాంగ్రెస్ వాళ్ళు పోలింగ్ పెడితే వాళ్ళ పార్టీకే వ్యతిరేకంగా ఎక్కువ ఓట్లు వచ్చాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేక గాలివీస్తుందని.. కాంగ్రెస్ ఏడాది పాలనలో ప్రజలు ఎవరు సంతోషంగా లేరని కేసీఆర్ వ్యాఖ్యానించారు. 'నేను ఎంత చెప్పినా ప్రజలు వినలేదు. అత్యాశ పడి కాంగ్రెస్ వాళ్లకు ఓటేశారు. అన్ని వర్గాలను కాంగ్రెస్ మోసం చేసింది. తెలంగాణలో ఉన్న ప్రతి బిడ్డ మనోడే.. అన్ని మబ్బుల తొలిగిపోయి ఇప్పుడు నిజాలు బయటకు వస్తున్నాయి. మంచేదో.. చెడు ఏదో ప్రజలకు ఇప్పుడిప్పుడే తెలుస్తోంది. కాంగ్రెస్ పాలనపై అంతటా అసంతృప్తే ఉంది' అని కేసీఆర్ అన్నారు. 'తెలంగాణలో ఏ ఒక్క పథకం కూడా సరిగ్గా అమలు కావడం లేదు. అన్ని పథకాలు గంగలో కలిసిపోయాయి. కరోనా లాంటి మహమ్మారి వచ్చిన కూడా నేను రైతు బంధు ఆపలేదు. రైతు భీమా వల్ల ఎంతోమంది రైతులకు సహాయం జరిగింది.ఆలోచన లేకుండా ఎవరో ఏదో చెబితే నమ్మి ఓట్లు వేస్తే ఏమైతదో తెలంగాణ ప్రజలకు మంచి గుణపాఠం అయ్యింది' అని కేసీఆర్ పేర్కొన్నారు.

# కేసీఆర్‌వి ఫాంహౌస్ కలలు

## స్థానిక సంస్థల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు కరువు

### పార్టీ ప్రతిష్ట కోసం పాకులాడుతున్న కేసీఆర్

### తీవ్ర స్థాయిలో మండిపడ్డ టీ పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్




**హైదరాబాద్, మహా :** కేసీఆర్ ఫాంహౌస్ కలలు మానుకోవాలని, ఫాంహౌస్‌లో కూర్చుని ఉత్తర కుమార ప్రగల్భాలు పలుకుతున్నారని టీ పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. కాంగ్రెస్ సర్కారుపై మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చేసిన వ్యాఖ్యలకు స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ కు అభ్యర్థులు కూడా దొరికే పరిస్థితి లేకపోవడంతో కేసీఆర్ అభ్యర్థుల కోసం ఏదేదో మాట్లాడుతున్నారని మండిపడ్డారు. తెలంగాణ ప్రజలు ఫాంహౌస్ పాలన, గడీల పాలన కోరుకోవడం లేదని, ప్రజాపాలన, ఇందిరమ్మ రాజ్యం కోరుకుంటున్నారని తెలిపారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో సాధించలేని ప్రగతిని కాంగ్రెస్ ఏడాది పాలనలోనే సాధించడంతో ఆయన దిక్కుతోచక ఏదేదో మాట్లాడుతున్నారన్నారు. కుమార్తె కవితపై ఇప్పుడు మరో లిక్కర్ స్కాం ఆరోపణలు వస్తుండటంతో ఆయన ఆ అంశాన్ని పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. అసెంబ్లీ సమావేశాలకు రాకుండా ప్రతిపక్ష నేతగా విఫలమైన కేసీఆర్ కాంగ్రెస్ అధికారంలో విఫలమైందని వ్యాఖ్యానించడం హాస్యాస్పదమన్నారు. కాంగ్రెస్ ఏడాది పాలనలో 50 వేలకు పైగా ఉద్యోగాలు భర్తీ చేయడం కనిపించడం లేదా? అని మహేశ్ కుమార్ గౌడ్ ప్రశ్నించారు.

అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు గద్దెదించినా పార్లమెంట్ ఎన్నికల్లో ఒక్క సీటూ దక్కకపోయినా గుణపాఠం నేర్వకుండా కేసీఆర్ ఫాంహౌస్‌లో పగటి కలలు కంటున్నారని ఎద్దేవా చేశారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో ఆ పార్టీకి అభ్యర్థులే కరువయ్యారన్నారు. ఈ ఎన్నికల్లో కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీకి మరోసారి భంగపాటు తప్పదని అన్నారు. నిజంగా ప్రజా ప్రభుత్వంపై వ్యతిరేకత ఉందని భావిస్తే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి ఎందుకు సన్నద్ధం కావడం లేదని నిలదీశారు. అధికారంలో ఉన్నంత కాలం ప్రజలను మాయమాటలతో మభ్య పెట్టారు, అధికారం పోయాక కూడా మరోసారి అదే తరహాలో వ్యవహరిస్తామంటే తెలంగాణ ప్రజల చెవులలో ఎంత కాలం పూలు పెట్టాలనుకుంటున్నారని ప్రశ్నించారు. ప్రజా పాలనపై ప్రజల్లో వ్యతిరేకత ఉంటే ఎందుకు ఫాం హౌజ్ దాటి ప్రజల్లోకి వెళ్ళలేదో చెప్పాలన్నారు. పదేళ్ళ పాలనలో జరిగిన అవినీతి ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తుండటం, దర్యాప్తు సంస్థలు ఒక్కో అంశంపై ఆధారాలను సేకరిస్తుండటంతో కేసీఆర్ కు మతి పోయినట్లుందన్నారు. ప్రజా ప్రభుత్వం ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం వహిస్తే అసెంబ్లీ వేదికగా ఎందుకు ప్రభుత్వాన్ని ప్రశ్నించలేకపోయారని నిలదీశారు. దెబ్బ కొడతా, దెబ్బ బలంగా ఉంటుందంటూ కేసీఆర్ చేసే వ్యాఖ్యలు ఇప్పుడేం కొత్తవి కావని, అధికారంలో ఉన్నప్పుడు కూడా ప్రతిపక్షాలను ఇలానే బెదరించారని మహేష్ కుమార్ గౌడ్ గుర్తు చేశారు.

# గద్దర్‌కు వ్యతిరేకంగా మాట్లాడితే ఖబర్దార్

## కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు సీఎం వార్నింగ్

- బీజేపీ ఆఫీసు ఉన్న ప్రాంతానికి గద్దర్ పేరు పెడతానని వ్యాఖ్య
- కుటుంబం కంటే సమాజ శ్రేయస్సుకే గద్దర్ ఎక్కువ కృషి చేశారు
- నమ్మిన సిద్ధాంతం కోసం చివరి శ్వాస వరకు పోరాడిన గద్దర్
- గద్దర్ జయంతి సభలో సీఎం రేవంత్



**హైదరాబాద్, మహా :** ప్రజా యుద్ధ నౌక గద్దర్ పై అనుచిత వ్యాక్యలు చేస్తే ఖబర్దార్ అంటూ కేంద్ర మంత్రి బండి సంజయ్ కు సీఎం రేవంత్ రెడ్డి వార్నింగ్ ఇచ్చారు. బీజేపీ ఆఫీస్ ఉన్న ప్రాంతానికి గద్దర్ పేరు పెడతామని సంచలన వ్యాఖ్యలు చేశారు. గద్దర్‌కు వ్యతిరేకంగా మాట్లాడితే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. గద్దర్‌ను అవమానిస్తే తగిన శాస్తి చేస్తామన్నారు. సమాజమే తన కుటుంబంగా గద్దర్ భావించారన్నారు. గద్దర్‌తో తనకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయని సీఎం పేర్కొన్నారు. శుక్రవారం రవీంద్ర భారతిలో గద్దర్ 77వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ, గద్దర్ తనను ఎప్పుడూ ప్రోత్సహించేవారని చెప్పారు. ఒంటరి అనే భావన తనకు వచ్చినప్పుడల్లా గద్దర్ దగ్గరకు వెళ్లేవాడినని గుర్తు చేసుకున్నారు. 'నీ బాధ్యత నెరవేర్చు.. ప్రజలు నీకు అవకాశం ఇస్తారు' అని గద్దర్ అనేవారని చెప్పారు. కుటుంబం కంటే సమాజ శ్రేయస్సుకే గద్దర్ నిత్యం కృషిచేసేవారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు.

గద్దర్ చెప్పినట్లే తాను బాధ్యత నెరవేర్చానని, ప్రజలు అవకాశం ఇచ్చారని చెప్పారు. సమాజానికి స్ఫూర్తినిచ్చేలా గద్దర్ అవార్డు ఉండాలని భావించామన్నారు. గద్దర్ పేరిట అవార్డు ఇవ్వడమంటే ఏటా ఆయనను స్మరించుకోవడమేనని చెప్పారు. గద్దర్ అవార్డుల బాధ్యతను డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు అప్పగించామన్నారు. గద్దర్ మృతదేహాన్ని తీసుకెళ్తే గత కేసీఆర్ ప్రభుత్వం ఎల్బీ స్టేడియానికి తాళం వేసిందని మండి పడ్డారు. గద్దరన్న చివరిచూపు ప్రజలందరికీ దక్కాలని ఎల్బీ స్టేడియానికి తీసుకొచ్చామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. గద్దర్ చివరి శ్వాస వరకూ తాను నమ్మిన సిద్ధాంతాల కోసం జీవించారని అన్నారు. పద్మ అవార్డులు ఇవ్వాలని ఐదుగురి పేర్లు కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేశామని గుర్తుచేశారు. గద్దర్, గోరటి వెంకన్న, చుక్కా రామయ్య, అందెశ్రీ, జయధీర్ తిరుమల రావు పద్మ అవార్డులు ఇవ్వాలని ప్రతిపాదించామని చెప్పారు. పక్క రాష్ట్రానికి ఐదు అవార్డులు ఇచ్చారని వాళ్లకంటే తాము ప్రతిపాదించిన వాళ్లు తక్కువా? అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు.

**గద్దర్ విశ్వ మానవుడు : డిప్యూటీ సీఎం**

తెలుగు సినీ రంగానికి గద్దర్ పేరుతో తెలంగాణ ఫిలిం అవార్డులు ఇవ్వబోతున్నామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఉగాది సందర్భంగా గద్దర్ తెలంగాణ ఫిలిం అవార్డులు ఇవ్వబోతున్నామని ప్రకటించారు. గద్దర్‌కు కులం, మతం లేదు ఆయన విశ్వ మానవుడని అభివర్ణించారు. గద్దర్ తెలంగాణలో పుట్టడం మన అదృష్టమని ఉద్ఘాటించారు. గద్దర్ జయంతి, వర్ధంతిని అధికారికంగా చేస్తారని ఎవరూ ఊహించి ఉండరని చెప్పారు. గద్దర్ జయంతి, వర్ధంతిని అధికారికంగా చేయాలని సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయించారని అన్నారు. పాట, మాటతో లక్షలాది మందిని ప్రభావితం చేశారని చెప్పుకొచ్చారు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమం కోసం గద్దర్ ప్రత్యేక పాట రాశారని గుర్తుచేశారు. గద్దర్ పాట తెలంగాణ ప్రజలను కదిలించిందని చెప్పారు. ఐదుగురికి పద్మ అవార్డులు ఇవ్వాలని కేంద్రానికి ప్రతిపాదన చేశామని చెప్పారు. గద్దర్, గోరటి వెంకన్న తదితరులకు ఇవ్వాలని లేఖ రాశామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు.




# ఉస్మానియా కొత్త ఆస్పత్రికి సీఎం రేవంత్ రెడ్డి భూమి పూజ


- 26.3 ఎకరాల్లో రూ.24 వేల కోట్లతో
- ప్రపంచస్థాయి ప్రమాణాలతో నిర్మాణం
- కొత్త ఆస్పత్రిలో రోబోటిక్ సర్జరీలకు ఓకే

**హైదరాబాద్, మహా :** నూతనంగా నిర్మించనున్న ఉస్మానియా ఆస్పత్రికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుక్రవారం శంకుస్థాపన చేశారు. గోషామహల్ స్టేడియంలో ఉస్మానియా ఆస్పత్రి నిర్మాణానికి నిర్ణయం తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం అత్యంథ అధునాతనమైన సాంకేతిక పరిజ్ఞానంతో ఆస్పత్రి నిర్మాణం కోసం ప్రణాళికలను సిద్ధం చేసింది. ఇందులో భాగంగా శుక్రవారం ఉదయం సీఎం భూమి పూజ చేశారు. మొత్తం 26.3 ఎకరాల విస్తీర్ణంలో నూతన ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణం జరుగనుంది. 32 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో నూతన ఆసుపత్రిని నిర్మించనున్నారు. 2 వేల పడకల సామర్థ్యంతో ఆస్పత్రి నిర్మాణానికి నిర్ణయం తీసుకుంది ప్రభుత్వం. రూ. 2400 కోట్లతో 14 అంతస్తుల్లో ఆస్పత్రి భవన నిర్మాణం జరుగనుంది. అత్యాధునిక వైద్య సౌకర్యాలతో 30 విభాగాలలో వైద్య సేవలు అందించనున్నారు. కొత్త ఆస్పత్రిలో రోబోటిక్ సర్జరీలు చేసేలా సౌకర్యాలు కల్పించనున్నారు. ప్రపంచ స్థాయి ప్రమాణాలతో కొత్త ఆస్పత్రికి డిజైన్ చేశారు. స్టాఫ్, మెడికల్ స్టూడెంట్స్ కోసం ప్రత్యేక భవనాలు నిర్మించనున్నారు. ప్రతీ గదిలో గాలి, వెలుతులు ఉండేలా డిజైన్లు చేశారు. అత్యాధునిక టెక్నాలజీలతో కూడిన మార్చురీ ఏర్పాటు చేయనున్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా నలువైపులా రోడ్లు వేయనున్నారు. అన్నిరకాల సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు ఇందులో ఉండేలా ఏర్పాటు చేస్తారు. ప్రతి డిపార్ట్‌మెంట్‌కు ప్రత్యేక ఆపరేషన్ థియేటర్లు ఉండనున్నాయి. ప్రతి థియేటర్‌కు అనుబంధంగా పోస్ట్ ఆపరేటివ్, ఐసీయూ వార్డులను నిర్మిస్తారు. ప్రస్తుతం అఫ్జల్‌గంజ్‌లో ఉన్న ఉస్మానియా ఆస్పత్రి శిథిలావస్థకు చేరడంతో కొత్త ఆస్పత్రిని గోషామహల్ స్టేడియంలో నిర్మించాలని నిర్ణయించారు. భూమి పూజ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, మంత్రులు పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సలహాదారు వేం నరేందర్ రెడ్డి, కేకేశవరావు, మేయర్ గద్వాల విజయలక్ష్మి, ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ ,రాజ్య సభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ సమస్యలకు ఇక చెక్

## ఎక్కడ రద్దీ ఉన్నా మీ మొబైల్‌కు సమాచారం

**హైదరాబాద్ సిటీ, మహా:** ట్రాఫిక్ సమస్యలను తగ్గించడంతో పాటు ప్రయాణికుల సమయాన్ని ఆదా చేసేందుకు సైబరాబాద్ పోలీసులు "ట్రాఫిక్ పల్స్" పేరుతో ఓ కొత్త ప్లాట్ ఫాంను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ ప్లాట్‌ఫాం ఆయా మార్గాల్లో ట్రాఫిక్ సమస్యలను ముందుగా గుర్తించి ప్రయాణికులకు, వాహనదారులకు సమాచారం చేరవేస్తుంది. రియల్ టైమ్ ట్రాఫిక్ అప్డేట్స్ తెలియడంతో ప్రయాణికులు ప్రత్యామ్నాయ మార్గాల్ని ఎంచుకునే అవకాశం ఉంటుంది.



EDITORIAL సంపాదకీయం

# మారని కేసీఆర్

## జనానికి బుద్ధొచ్చిందంటున్న బాపు!!

కేసీఆర్ కు తెలంగాణ ప్రజలపై ఎంత అక్కసు ఉన్నదో,తనకు అధికారం నుంచి వాళ్లపై ఎంత ఆగ్రహం ఉన్నదో అర్థమవుతున్నది.'ప్రజలకు గుణపాఠం' వచ్చిందని మాత్రమే ఆయన అనుకుంటున్నారు కానీ పొరపాటున కూడా తమ తప్పిదాలు,తమ పార్టీ నాయకులు,ప్రజా ప్రతినిధులు చేసిన దోపిడీలు,కుటుంబ పాలన వల్ల జరిగిన నష్టం, ఢిల్లీని ఏలాలని చేసిన సర్కస్, అసెంబ్లీ ఎన్నికలలో ప్రజల తిరస్కారం, లోక్ సభ ఎన్నికల్లో ఒక్క సీటు కూడా నోచుకోని దుస్థితి, ప్రజల్లో ఇప్పటికీ తమ పార్టీ పట్ల రాని సానుభూతి, తగ్గని కోపం.... వంటి అంశాలేవీ సమీక్షించుకోవాలని కేసీఆర్ అనుకోవడం లేదు.





- ఎస్.కే.జకీర్, సీనియర్ జర్నలిస్ట్

''కాంగ్రెస్ ని నమ్మితే నట్టేట ముంచుతరు అని ఆరోజే చెప్పిన.కానీ జనం నా మాట వినలేదు.తులం బంగారం అనగానే నమ్మి ఓట్లు వేశారు.ఆలోచన లేకుండా ఎవరో ఏదో చెబితే నమ్మి ఓట్లు వేస్తే ఏమైతదో తెలంగాణ ప్రజలకు మంచి గుణపాఠం అయ్యింది.తెలంగాణ ప్రజల పని కైలాసం ఆటలో పెద్ద పాము మింగినట్లు అయ్యింది''బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ శుక్రవారం అన్నారు. 'నేను చెప్పినట్లు విని బిఆర్ఎస్ కు ఓట్లు వేసి ఉంటె పరిస్థితి వేరుగా ఉండేది.కాంగ్రెస్ కు ఓట్లు వేసినందున ఇప్పుడు బుద్ధొచ్చింది' అని ఆయన మాటల తాత్పర్యం.

కేసీఆర్ కు తెలంగాణ ప్రజలపై ఎంత అక్కసు ఉన్నదో,తనకు అధికారం నుంచి వాళ్లపై ఎంత ఆగ్రహం ఉన్నదో అర్థమవుతున్నది.'ప్రజలకు గుణపాఠం' వచ్చిందని మాత్రమే ఆయన అనుకుంటున్నారు కానీ పొరపాటున కూడా తమ తప్పిదాలు,తమ పార్టీ నాయకులు,ప్రజా ప్రతినిధులు చేసిన దోపిడీలు,కుటుంబ పాలన జరిగిన నష్టం,ఢిల్లీని ఏలాలని చేసిన సర్కస్,అసెంబ్లీ ఎన్నికలలో ప్రజల తిరస్కారం,లోక్ సభ ఎన్నికల్లో ఒక్క సీటు కూడా నోచుకోని దుస్థితి,ప్రజల్లో ఇప్పటికీ తమా పార్టీ పట్ల రాని సానుభూతి,తగ్గని కోపం.... వంటి అంశాలేవీ సమీక్షించుకోవాలని కేసీఆర్ అనుకోవడం లేదు.

'అంతా ప్రజలదే తప్పు,నేను చెప్పినా వినిపించుకోలేదు' అనే ధోరణి రాజకీయ నాయకులెవరికీ తగని పని.''నేను గంభీరంగా ,మౌనంగా ఈ ప్రభుత్వాన్ని చూస్తున్న,కొడితే మామూలుగా కాదు గట్టిగా కొట్టటం నాకు ఉన్న అలవాటు'' అని కూడా కేసీఆర్ గాంభీర్యాన్ని ప్రదర్శించారు.ప్రజలు 2023 డిసెంబర్ లోనే బిఆర్ఎస్ ను బలంగా కొట్టారు.అందుకే అసెంబ్లీలో 104 సీట్ల నుంచి 39 కి తగ్గించి,మూటా ముల్లె కట్టి కేసీఆర్ ను జనం ఫార్మ్ హౌజ్ కు పంపించేశారు. ఆయన మళ్ళీ 13 నెలల తర్వాత 'బోనులో నుంచి వచ్చిన పులిలా పంజా విసురుతార'ని కాంగ్రెస్ పార్టీ భయపడాలి కావచ్చు.అధికారం కోల్పోయిన ఏడాది తర్వాత కూడా వాస్తవం ఒప్పుకోవడానికి కేసీఆర్,కేటీఆర్,హరీశ్ రావు తదితరులు సిద్ధంగా లేరు.తమ 'గడీల పాలన'ను గట్టిగా సమర్థించుకుంటున్నారు. ఫార్మ్ హౌజ్ నుంచే పాలన సాగుతుందనీ చెబుతున్నారు.పైగా దాన్ని 'ఫార్మర్ హౌజ్' గా బిఆర్ఎస్ మీడియా బుకాయింపు.ప్రజలతో సంబంధాలు తెంచుకుంటే,ప్రజలు అధికారంలో ఉన్నవారికి ఎలాంటి బుద్ధి చెప్పగలరో చూసాం. అందుకు భిన్నంగా జనానికి ఇప్పటికయినా 'బుద్ధి వచ్చింది' అనే అర్థంలో మాట్లాడడం వింతగానే,అహంకారపూరితంగా ఉన్నది.

అధికారం కోల్పోయిన ఏడాది తర్వాత కూడా వాస్తవం ఒప్పుకోవడానికి కేసీఆర్,కేటీఆర్,హరీశ్ రావు తదితరులు సిద్ధంగా లేరు.తమ 'గడీల పాలన'ను గట్టిగా సమర్థించుకుంటున్నారు.

'ఎక్కడ నెగ్గాలో,ఎక్కడ తగ్గాలో తెలీకుండా పట్టువిడుపులు లేకుండా అంతా నా ఇష్టం,నాకు నచ్చినట్టు నేను బతుకుతానని మొండిగా, మూర్ఖంగా ఉండే వ్యక్తులు మన ఇంట్లోనో,బంధువుల్లోనో,స్నేహితుల్లోనో లేదా మన చుట్టుపక్కలో ఉంటూనే ఉంటారు.ఇలాంటివాళ్ళ వల్ల వాళ్ళతో ఉన్నవాళ్ళే ఎక్కువ నష్టపోతారు.అందరి జీవితాల్ని వాళ్ళకు నచ్చినట్టు నిర్దేశిస్తారు'.ఈ మాటలన్నీ కేసీఆర్ కు సరిగ్గా అతుకుతాయి.ఇంట్లోనో,బంధువుల్లోనూ ఇలా ఉంటే నష్టం కొందరికే. కానీ రాజకీయాల్లో ఉండేవాళ్ళు ఇలా ప్రవర్తిస్తే మొత్తం సమాజానికే హాని కలుగుతుంది.

''తెలంగాణలో ఏ ఒక్క పథకం కూడా సరిగ్గా అమలు కావడం లేదు.కరోనా సమయంలోనూ నేను రైతు బంధు ఆపలేదు.రైతు భీమా వల్ల ఎంతోమంది రైతులకు సహాయం జరిగింది.మళ్ళీ కరెంట్ కోతలు..మంచి నీళ్ల కరువు వచ్చాయి.కాంగ్రెస్ పార్టీ ఓట్ల కోసం ముస్లింలను వాడుకుంది కానీ వారికి ఏమి చేయలేదు.తెలంగాణలో అన్ని వ్యాపారాలు పడిపోయాయి.రియల్ ఎస్టేట్ వ్యాపారం పూర్తిగా పడిపోయింది. అందరు కెసిఆర్ ని గుర్తు చేసుకుంటున్నారు.భూముల ధరలు పడిపోయాయి.బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు ఎకరానికి నలభై యాభై లక్షల ధర ఉండేది.కానీ ఇప్పుడు సగానికి సగం పైగా ధరలు పడిపోయాయి.నేను ఎన్నో ప్రభుత్వాలని చూసా. కానీ ఇలాంటి ప్రభుత్వాన్ని ఎప్పుడు చూడలేదు. ఏడాదిలోనే ఇంత వ్యతిరేకత కాంగ్రెస్ ప్రభుత్వంపై వచ్చింది.కాంగ్రెస్ వాళ్ళు కనపడితే జనాలు కొట్టేలా ఉన్నారు.పోయిన ఏడాది కంటే ఈ ఏడాది ఆదాయం 13 వేల కోట్లు తగ్గింది.

నేను సీఎం గా ప్రతి ఏడాది పది వేల కోట్ల ఆదాయం పెంచుకుంటూ వెళ్లాం.కానీ ఇప్పుడు కాంగ్రెస్ హయాంలో ఆదాయం తగ్గింది. మరో నాలుగు నెలల్లో జీతాలు కూడా ఇవ్వలేని స్థితిలో తెలంగాణ ప్రభుత్వం ఉంది. తెలంగాణను ఈ కాంగ్రెస్ ప్రభుత్వం దివాళా తీయించింది.ఖచ్చితంగా రాబోయే ప్రభుత్వం మనదే.దానిలో అనుమానం లేదు'' అని కేసీఆర్ వ్యాఖ్యలు చేశారు.ఇందులో మనందరికీ అర్థమయిన విషయాలు: 1.కరెంటు లేక రాష్ట్రం పూర్తిగా అంధకారంలో మునిగిపోయింది.2.వ్యాపారాలు లేక తెలంగాణ దివాళా తీసింది. 3.ఏ ఒక్క పథకమూ అమలు కావడం లేదు.4. రేవంత్ ప్రభుత్వాం వంటి ప్రభుత్వాన్ని ఇదివరకెన్నడూ కేసీఆర్ చూడలేదు.5.మరో నాలుగు నెలల్లో జీతాలు ఇచ్చే పరిస్థితి లేదు.

మాజీ సీఎం చెబుతున్న మాటల్లో,ఆయన అల్లుతున్న కథల్లో అసలు నిజమెంత? ప్రభుత్వం పైన అప్పుడే అంత భయంకరమైన వ్యతిరేకత వచ్చిందా? కరెంటు లేక,నీళ్లు లేక జనం రైతులు అల్లాడుతున్నారా?ఆదాయం తగ్గిపోవడానికి రేవంత్ కారణమా? జీతాలు ఇవ్వడానికి మరొక నాలుగు నెలల వరకే డబ్బు ప్రభుత్వం దగ్గరున్నదా? కేసీఆర్ 'కంఠ స్వరం' బాగుంటుంది.పైగా ఆయన చెప్పే పద్ధతి,విడమరచి చెప్పే తీరు సహజంగా జనాన్ని ఇదివరకు ఆకట్టుకునేవి.కానీ పదేండ్ల పాలన తర్వాత అవన్నీ 'కట్టుకథలు' గా జనం అర్థం చేసుకొని ఓడించారు.ప్రజలే అంతిమ న్యాయనిర్ణేతలు అనీ,వాళ్ళ ఆశీస్సులు ఉంటేనే మరలా తాము అధికారంలోకి వస్తామని కేసీఆర్ సహా ఆ పార్టీ నాయకుల నుంచి ఒక్క రోజు కూడా మాట రావడం లేదు.తెలంగాణ తెచ్చింది తామే కనుక తమదే శాశ్వత అధికారమన్న రాజరికపు పోకడలు వాళ్ళ వ్యాఖ్యల్లో కనిపిస్తున్నవి.

ప్రజలు 2023 డిసెంబర్ లోనే బిఆర్ఎస్ ను బలంగా కొట్టారు.అందుకే అసెంబ్లీలో 104 సీట్ల నుంచి 39 కి తగ్గించి,మూటా ముల్లె కట్టి కేసీఆర్ ను జనం ఫార్మ్ హౌజ్ కు పంపించేశారు. ఆయన మళ్ళీ 13 నెలల తర్వాత 'బోనులో నుంచి వచ్చిన పులిలా పంజా విసురుతార'ని కాంగ్రెస్ పార్టీ భయపడాలి కావచ్చు.

తెలంగాణను అన్ని రకాలుగా దివాలా తీయించిన కేసీఆర్ మళ్ళీ ఏ మొహం పెట్టుకొని అధికారంలోకి రావాలనుకుంటున్నారో అర్థం కాదు.కాంగ్రెస్ పార్టీ అధికారం చేబట్టాక ప్రతి నెలా ప్రభుత్వానికి వస్తున్న ఆదాయం 18,500 కోట్లు.ఇందులో ఉద్యోగుల జీతభత్యాలు,ఇతర అవసరాలకు 6,500 కోట్లు ఖర్చవుతున్నవి.కేసీఆర్ ప్రభుత్వం అప్పులు చేసి పంచిన కారణంగా వాటిపై వడ్డీ కింద ప్రతి నెలా 6,500 కోట్లు రేవంత్ ప్రభుత్వం చెల్లిస్తున్నది.సంక్షేమ కార్యక్రమాల కోసం 5,500 కోట్లు ఖర్చు చేస్తున్నారు.ప్రతి నెలా ప్రభుత్వం ఎలాంటి ఇబ్బందులు లేకుండా పాలన సాగించాలంటే కనీసం 22,500 కోట్ల రూపాయలు కావాలి.నెలకు 30 వేల కోట్ల రాబడి ఉంటే ప్రభుత్వానికి ఎలాంటి ఆర్థిక ఇబ్బందులూ లేకుండా సజావుగా పరిపాలన సాగిస్తుంది.వస్తున్న ఆదాయానికి,ఖర్చులకు పొంతన లేని పరిస్థితులు కేసీఆర్ పరిపాలన దుష్ఫలితంగా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అంటున్నారు.

''అసెంబ్లీ ఎన్నికలను అడ్డు పెట్టుకుని రైతు బంధు ఎగ్గొట్టిన చరిత్ర కెసిఆర్ ది.ఆయన ఎగ్గొట్టిన రైతు భరోసా నిధులను మా ప్రభుత్వం అధికారంలోకి రాగానే రైతుల ఖాతాలో వేశాం. 2014 నుంచి 2023 డిసెంబర్ వరకు కేసీఆర్ చేసిన రైతు రుణమాఫీ కేవలం రూ.18వేల కోట్లు మాత్రమే.ఇందులో మిత్తికి పోగా నికరంగా ఆయన చేసిన రుణమాఫీ కేవలం రూ.3 వేల కోట్లు మాత్రమే.మేం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే 21వేల కోట్లు రుణమాఫీ చేశాం అసెంబ్లీకి రా లెక్కలు చెబుతాం.రైతుల జాబితాతో సహా మేం చేసిన రుణమాఫీ లెక్కలు చూపిస్తాం.నీకు చిత్తశుద్ధి ఉంటే అసెంబ్లీకి రా.నీలా ఇచ్చిన హామీలను ఎగ్గొట్టి పంగనామాలు పెట్టిన చరిత్ర నాది కాదు.ఆయన గంభీరంగా చూస్తున్నడట...ఎవరిని చూస్తున్నావ్?అచ్చోసిన ఆబోతుల్లా కొడుకు,అల్లుడిని ఊరిమీదకు వదిలిండు.పాలమూరును ఎరవేసి ఎండబెట్టిన దుర్మార్గుడు కెసిఆర్ .మాప్రభుత్వంలో రైతులకు రుణమాఫీ జరిగింది, రైతు భరోసానూ ఇస్తున్నం.మార్చి 31 లోగా రూ.10 వేల కోట్లు రైతు భరోసా వేస్తాం.భూమిలేని వ్యవసాయ కూలీ కుటుంబానికి ఏడాదికి రూ.12 వేలు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అందిస్తాం.మొదటి ఏడాదిలోనే 55142 ఉద్యోగ నియామకాలు పూర్తి చేసిన ఘనత మా ప్రభుత్వానిది.కొడితే బలంగా కొట్టడం సంగతి పక్కకు పెడితే సరిగ్గా నిలబడటం నేర్చుకో. పదేళ్లు ముఖ్యమంత్రిగా చేసిన ఆయన సోషల్ మీడియాలో లైకులు వచ్చాయని చెప్పుకుంటుండు అంటే ఆయన మానసిక స్థితి'' అంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మొగిలిగిద్ద సభలో కేసీఆర్ పై నిప్పులు చెరిగారు.

కేసీఆర్ మాస్ ఇమేజ్ మసకబారింది. బిఆర్ఎస్ పేరిట ఎన్నికల బరిలోకి దిగిన గులాబీ పార్టీకి ప్రజలు పట్టం కట్టలేదు.రెండు సార్లు అధికార పగ్గాలు చేపట్టిన తర్వాత టిఆర్ఎస్ పార్టీని బిఆర్ఎస్ పార్టీగా మార్చుకుంది. పార్టీ పేరును మార్చడం ద్వారా తెలంగాణ ఉద్యమ మూలాలతో కేసీఆర్ బంధం తెగిపోయింది.

ఫిబ్రవరి చివరిలో భారీ బహిరంగ సభ ఉంటుందని కేసీఆర్ ప్రకటన వెనుక తమ పార్టీ శ్రేణులు జారిపోకుండా చూసుకునే వ్యూహమే కనిపిస్తోంది.ఇప్పటికే తెలంగాణ సమాజంలో కేటీఆర్,హరీశ్ రావు,కవిత ఉద్యమాలు,ధర్నాలు,సభలు,సమావేశాలు జరుపుతున్నా ప్రజల్లో పార్టీ శ్రేణుల్లో రావలసిన ఉత్తేజం రావడం లేదు.రావలసిన ఉత్సాహమూ కనిపించడం లేదు.ఈ పరిస్థితులను బేరీజు వేసుకున్న తర్వాత ఇక పార్టీ మనుగడ కోసం తానే నేరుగా రంగంలోకి దిగి 'కత్తి' తిప్పాలని అనుకుంటున్నట్లున్నది.ఫిబ్రవరి సభలో తమ పదేండ్ల పాలనలో జరిగిన లోపాలు,చేసిన పాపాలకు ప్రాయశ్చిత్తం చేసుకునే అవకాశాలు బొత్తిగా లేవు. మరలా తాము ఫార్మ్ హౌజ్ నుంచే పరిపాలిస్తామని ఆ సభలో ప్రజలకు చెప్పగలరా?ఇదివరకటి లాగే ఇనుప ముళ్ల కంచెలు దుర్భేధ్యమైన ప్రగతి భవన్ వంటి 'కోట' నుంచే విధాన నిర్ణయాలు చేస్తామని జనానికి తెలియజేయగలరా?ధరణి పేరిట జరిగిన లక్షలాది ఎకరాల భూ దోపిడీ మళ్ళీ చెయ్యక తప్పదని అనగలరా? ఇదివరకటి లాగే తానూ,తమ మంత్రులూ,ఎమ్మెల్యేలు ప్రజలకు అందుబాటులో లేకుండా ఉంటారని చెప్పగలరా?తమ మంత్రుల పీ.ఏలు సైతం వందల కోట్లకు ఎగబాకే సౌకర్యం ఉంటుందని సభలో చెప్పగలరా?

కేసీఆర్ మాస్ ఇమేజ్ మసకబారింది. బిఆర్ఎస్ పేరిట ఎన్నికల బరిలోకి దిగిన గులాబీ పార్టీకి ప్రజలు పట్టం కట్టలేదు.రెండు సార్లు అధికార పగ్గాలు చేపట్టిన తర్వాత టిఆర్ఎస్ పార్టీని బిఆర్ఎస్ పార్టీగా మార్చుకుంది. పార్టీ పేరును మార్చడం ద్వారా తెలంగాణ ఉద్యమ మూలాలతో కేసీఆర్ బంధం తెగిపోయింది. తెలంగాణ గళం,తెలంగాణ బలం,తెలంగాణ దళం అంటూ తెలంగాణ అస్తిత్వ నినాదాన్ని తెరపైకి తీసుకురావడానికి గత పార్లమెంటు ఎన్నికల్లోనే కేటీఆర్ అండ్ కో ప్రయత్నించినా లాభం లేకపోయింది.''కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో చెప్పినవన్నీ భూటకపు హామీలు.అర చేతిలో వైకుంఠం చూపించారు.పార్లమెంటు ఎన్నికల తర్వాత ఈ ప్రభుత్వం ఉంటదో, ఊడుతదో.. ఏం జరుగుతదో తెలియదు'' అని పార్లమెంటు ఎన్నికల సభల్లో కేసీఆర్ చెప్పారు.అంటే కాంగ్రెస్ అధికారం చేబట్టిన ఐదారు నెలలకే ఊడిపోతుందని ఆయన ఊహించారేమో! అలాంటిది జరగకపోగా ఏడాదికిపైగా రేవంత్ సుస్థిర పాలనను సాగిస్తున్నారు.''బీఆర్ఎస్ ఎంపీల గెలుపులోనే తెలంగాణ గెలుపు ఉంద''ని కూడా అప్పట్లో కేసీఆర్ అన్నారు.కానీ ఆయన పార్టీ లోక్ సభ ఎన్నికల్లో 7 చోట్ల డిపాజిట్లు పోగొట్టుకున్నది.9 చోట్ల మూడవ స్థానానికి పరిమితమైంది.అంటే 'తెలంగాణ ఓడిపోయినట్లవుతుందా'?

ఇంతవరకైతే కాంగ్రెస్ ప్రభుత్వంపై పూర్తి వ్యతిరేకత అనేది విజిబుల్‌గా కనిపించడం లేదు.లగచర్ల లాంటి ఒకట్రెండు ఘటనలు తప్పితే.అయితే, అక్కడ కూడా ప్రభుత్వం ఒకడుగు వెనక్కి వేసి జాగ్రత్తగా దిశను మార్చుకున్నది.ప్రజలు వ్యతిరేకిస్తున్నందున దిలావర్ పూర్ లో ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటు అనుమతులను నిలిపివేసింది.రైతుభరోసా పథకం అమలులో జరుగుతున్న జాప్యం కాంగ్రెస్ ప్రభుత్వంపై కొంత అసంతృప్తికి కారణమైనా దాన్నుంచి బయటపడడానికి రేవంత్ వేగంగా నిర్ణయాలు తీసుకుంటున్నారు.

**రచనలకు ఆహ్వానం**

ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.

మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp-
7436939999

# లక్ష్యం కోసం లక్ష డప్పులు వేల గొంతుకల సభ



దేవులపల్లి రమేశ్,
సిద్ధిపేట జిల్లా, 9963701294

మాదిగల లక్ష్యసాధన కోసం "వేల గొంతుకలు లక్ష డప్పుల"మాదిగ ఉపకులాలకు విద్య, ఉద్యోగ రంగాల్లో జరుగుతున్న అన్యాయాన్ని తెలుపుకొని ఎస్సీ, ఏబిసిడి వర్గీకరణ కోసం, గత 30 సంవత్సరాల నుండి వర్గీకరణ కోసం పోరాడుతున్న మాదిగ ఉపకులాలకు సంబందించి ఇటీవల సుప్రీంకోర్టు, ఏబిసిడి వర్గీకరణ విషయంలో సానుకూలంగా తీర్పు రావడం జరిగింది. ఈ నేపథ్యంలో వర్గీకరణ అమలు చేయాలని ప్రతి గ్రామంలో పల్లె పల్లెనా పల్లె నుండి పట్నం వరకు, మారుమూల ప్రాంతం నుండి మహానగరం వరకు మాదిగ దండోరా యాత్ర సాగుతుంది. మాదిగ వర్గీకరణ ఆకాంక్ష మూడు దశాబ్దాల పోరాటం దారి ఈ పోరాటంలో ప్రాణ త్యాగాలు చేసిన మాదిగ అమరులు కూడా ఎందరో ఉన్నారు. వర్గీకరణ సాధన లక్ష్యంగా ఏర్పడిన మాదిగ దండోరా, సమాజంలోని అన్ని వర్గాల మన్నలు పొందిన ఉద్యమాల ఊట,ఎమ్మార్పీఎస్ గా స్థిరపడింది. ఎస్సీ రిజర్వేషన్ ఫలాలు విషయంలో మాదిగలకు జరుగుతున్న అన్యాయాన్ని గుర్తించి, ఎస్సీ కులాల జనాభా నిష్పత్తి ప్రకారం కేటగిరీలో రిజర్వేషన్లు విభజించాలని దళితుల్లో అత్యంత వెనుకబడిన కులాల వారికి న్యాయం చేరాలని డిమాండ్ తో ఆంధ్రప్రదేశ్ ప్రకాశం జిల్లా,ఈదుముడిలో గ్రామంలో 13 మంది యువకులతో 1994 జులై 7న మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి స్థాపించారు. మాదిగ దండోరా ఉద్యమంతో మందకృష్ణ మాదిగ, అనతి కాలంలో మాదిగలకు ఆత్మ గౌరవ ప్రతీకగా నిలిచారు. మాదిగల కోసం ఎస్సీ వర్గీకరణ పోరాటాన్ని ప్రారంభించిన ఆయన. దివ్యాంగులు, వృద్ధులు, హృద్రోగంతో బాధపడుతున్న చిన్నారుల గుండె ఆపరేషన్ కోసం, ఉద్యమాలు నిర్మించారు. పేద కుటుంబాలకు చెందిన హృద్రోగ బాధిత పిల్లలను ఆదుకోవాలంటూ పిల్లలతో కలిసి హైదరాబాదులో 2004లో భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వం స్పందించి 2004 ఆగస్టులో రాష్ట్ర వ్యాప్తంగా వైద్య శిబిరాలను నిర్వహించింది. సుమారు 5,500 మంది గుండె జబ్బులతో పిల్లలను గుర్తించి వారికి ఉచిత చికిత్స అందించేందుకు నిర్ణయించింది.ఆ పోరాటం స్ఫూర్తిగానే నాటి సీఎం వైఎస్ఆర్ ఆరోగ్య శ్రీ పథకాన్ని తెచ్చారన్న అభిప్రాయాలు కూడా ఉన్నాయి. దివ్యాంగుల కోసం 2007లో మందకృష్ణ నిజాం కళాశాల మైదానంలో మహా గర్జన నిర్వహించారు. వృద్ధులు, వితంతువుల, తరపున మంద కృష్ణ ఉద్యమాలు నిర్వహించారు. 2007లో మందకృష్ణ వికలాంగుల హక్కుల పోరాట సమితి, నెలకొల్పారు. దివ్యాంగులకు ప్రతినెల పింఛన్లు ఇవ్వాలని రిజర్వేషన్లు అమలు చేయాలని ఉద్యమించారు. దీంతో వారికి ప్రభుత్వం పింఛన్ పథకాన్ని ప్రకటించింది. ఫలితంగా తెలుగు రాష్ట్రాల్లో వికలాంగులకు పింఛన్ లభిస్తుంది. ఎమ్మార్పీఎస్ తెలంగాణ రాష్ట్రంలో ఏర్పడడంలో కూడా కీలక పాత్ర పోషించింది. సామాజిక సమస్యలపై ఉద్యమ పోరాటం చేస్తూ సామాజిక న్యాయం కోసం అనితర పోరాటయోధుడు, సామాజిక మార్పు కోసం అహర్నిశలు కృషి చేస్తున్న మాదిగ హక్కుల ఉద్యమమే మానవ హక్కుల ఉద్యమం అని నినదించిన నాయకుడు మంద కృష్ణ మాదిగ, రాష్ట్ర ప్రభుత్వాలకు సామాజిక సమానత్వం కోసం ప్రశ్నిస్తూ సామాజిక సమస్యలపై నిరంతర పోరాటం చేస్తున్న మందకృష్ణ మాదిగ, మాదిగ దండోరా ఉద్యమాన్ని ఉమ్మడి రాష్ట్ర వ్యాప్తంగా వ్యాప్తింపజేశారు. దండోరా ఉద్యమంతో 1997లో చంద్రబాబు ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ అమలు చేసేందుకు, రామచంద్ర రాజు కమిషన్ ఏర్పాటు చేసింది. ఈ కమిషన్ నివేదిక ఆధారంగా 2000 ఏప్రిల్ నుంచి,2004 నవంబర్ 4 వరకు ఎస్సీ వర్గీకరణ అమలు జరిగింది. దీనితో మంద కృష్ణ మాదిగ, మాదిగల కు ఒక బలమైన నాయకుడిగా పేరు పేరొందరు. 1994 ఎస్సీ వర్గీకరణ ఉద్యమం అనేక సామాజిక ఉద్యమలు చేశారు. ఎస్సీ వర్గీకరణ విషయంలో గత ఏడాది ఆగస్టు 1న 2024 సుప్రీంకోర్టు వెల్లడించిన అనుకూల తీర్పు వరకు ఎమ్మార్పీఎస్ కు 30 ఏళ్లుగా మందకృష్ణ మాదిగకు ఉద్యమ చరిత్ర ఉంది. ఈ నేపథ్యంలో వర్గీకరణ సాధకుడైన మందకృష్ణ, నాయకత్వంలో జరగబోవు "వేయి గొంతుకలు" లక్ష డప్పులు" అనే సభ నిర్వహణకు ఏర్పడిన కార్యవర్గానికి రాష్ట్ర అధ్యక్షుడిగా ఏపూరి సోమన్న, సారథ్యంలో హైదరాబాద్ గడ్డపైన ఫిబ్రవరి 7న జరుగుతున్న ఈ చారిత్రాత్మక సభకు సన్నాహాలు, ర్యాలీలతో తెలంగాణ కొరకు ఆడి పాడిన సబ్బండ వర్గాల కళాకారులు ఇమ్మతి తో గోసి / గొంగడి, కాలి గజ్జె డప్పులతో కలిసి తెలంగాణలో ప్రతి పల్లెని చుట్టనున్నారు. దండోరా ఎందుకు పుట్టిందోయ్,డప్పెందుకు గర్జన చేసిందోయ్, పోరుకు పయనం కట్టింది అంటాడు మరొక వాగ్గేయకారుడు పోలిశెట్టి లింగన్న. దండోరా సమాన హక్కుల కొరకు పయనమైన మానవ హక్కుల దండోరా వేసింది. సమాజానికి మేల్కొల్పు డప్పు పైన మాదిగ అస్థిత్వ దరువును మోగించింది. వర్గీకరణ సాధన త్వరితగతిన అమలు చేయాలని ఉద్దేశంతో ఫిబ్రవరి 7న హైదరాబాద్ నగరం నడిబొడ్డున "లక్ష డప్పులు వేయి గొంతుకలు" కవాతు చేయనున్నారు.మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి, న్యాయబద్ధ పోరాటమని సబ్బండ వర్గాలు మద్దతు తెలుపుతున్నారు. ఎమ్మార్పీఎస్, 30 ఏళ్ల పోరాటానికి ప్రధాన మంత్రి మోడీ గత ఏడాది ఎన్నికలప్పుడు ఎమ్మార్పీఎస్ సభకు హాజరై వర్గీకరణకు మద్దతు ప్రకటించారు. 30 సంవత్సరాల పోరాటం ఫలితంగా సుప్రీం కోర్ట్ ధర్మాసనం గత ఏడాది ఆగస్టులో వర్గీకరణకు అనుకూలంగా తీర్పు వెలవరించింది. అణగారిన వర్గాల కోసం మూడు దశాబ్దాల మందకృష్ణ చేస్తున్న పోరాటాన్ని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం ఆయనను పద్మశ్రీ అవార్డుకు ఎంపిక చేసింది. మందకృష్ణ మాదిగ పోరాట యోధుడికి పద్మశ్రీ పురస్కారం రావడం రాజకీయ ప్రముఖులు, బీసీల సంఘాల నాయకులు ఇతర సామాజిక వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# కాళ్లు చేతులు నరికి హత్య చేసిన దుండగులు

■ ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవి రాజు..మంగళపల్లి సమీపంలో దారుణ హత్య



**ఇబ్రహీంపట్నం, మహా:** ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక వ్యక్తిని అతి కిరాతకంగా హత్య చేసి నిర్మానుష్య ప్రాంతంలో పడివేసిన వైనం చోటు చేసుకుంది. ఇబ్రహీంపట్నం మండలం, మంగళపల్లి రెవెన్యూ పరిధి సాగర్ హైవే సమీపంలో మృతదేహం లభ్యం కావడంతో సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవి రాజు తెలిపిన వివరాల ప్రకారం, స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించడం జరిగిందన్నారు. 3,4 రోజుల క్రితం హత్య చేసి ఉంటారని భావిస్తున్నాం. ఘటన స్థలానికి చేరుకొన్న క్లూజ్ టీం వివరాలు సేకరించడం జరిగిందని అన్నారు. మృతుడి చేతులు, కాళ్ళు నరికి అతి దారుణంగా హత్య చేశారని చెప్పారు. ఇంతటి దారుణానికి వడిగట్టిన దుండగులను త్వరలోనే పట్టుకుంటామని తెలిపారు. మృతుడి షర్ట్ కాలర్ పై డిండి మండలం, చెర్కుపల్లి అని స్టిక్కర్ ఉందన్నారు. మృతుడు దిండి మండలానికి చెందిన వ్యక్తిగా భావిస్తున్నామని అన్నారు. పోస్ట్ మార్టం నిమిత్తం మృతదేహని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. దర్యాప్తు చేపట్టి త్వరలోనే పూర్తీ వివరాలు వెల్లడిస్తామని ఏసీపీ కేపీవి రాజు తెలిపారు.

# గ్రీవెన్స్ సమస్యలను వెంటనే పరిష్కరించాలి

■ బల్దియా కమిషనర్ డాక్టర్ అశ్వని తానాజీ వాకడే.. పట్టణ ప్రణాళిక విభాగ అధికారులతో సమీక్ష



**వరంగల్, మహా:** టౌన్ ప్లానింగ్ అధికారులు గ్రీవెన్స్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని బల్దియా కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే సంబంధిత విభాగ అధికారులను ఆదేశించారు. శుక్రవారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్లో పట్టణ ప్రణాళిక విభాగ అధికారులతో జరిగిన సమావేశంలో కమిషనర్ సమీక్షిస్తూ ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం లో ప్రజల నుండి స్వీకరించే పట్టణ ప్రణాళిక విభాగ సంబంధ సమస్యల (ఫిర్యాదులు)తో పాటు రెగ్యులర్ గా వచ్చే టౌన్ ప్లానింగ్ ఫిర్యాదులలో జాప్యం లేకుండా పరిష్కరించాలని అన్నారు. ఏప్రిల్ 2024 నుండి ఇప్పటి వరకు డ్యాష్ బోర్డు లో నమోదైన ఫిర్యాదుల పరిష్కారం పై చొరవ చూపాలని, గ్రీవెన్స్ పోర్టల్ లో సివిల్ ఫిర్యాదుల కు సంబంధించిన సమాచారాన్ని నవీకరించాలని (అప్డేట్), పెండింగ్ గ్రీవెన్స్ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రొఫార్మా తయారు చేయాలని సిటీ ప్లానర్ ను కమిషనర్ ఆదేశించారు. సివిల్ సంబంధిత సమస్యలు ఉంటే సిటీ ప్లానర్ క్షేత్రస్థాయిలో పరిశీలించి, భూ సమస్యలు ఉంటే అది పరిష్కారం అయ్యేవరకు ఎలాంటి అనుమతులు ఇవ్వకూడదని అన్నారు. డిప్యూటీ కమిషనర్ సర్టిఫికేషన్ తో మాత్రమే అనుమతించాలని ఏదైనా ధృవ పత్రాలు సమర్పించుకుంటే (షాట్ ఫాల్) అసిస్టెంట్ సిటీ ప్లానర్లు టెక్నికల్ ఆఫీసర్లు నెట్ షీట్ లో పొందుపర్చాలని తెలిపారు. షాట్ ఫాల్ సంబంధిత సమస్యలు పరిష్కారం జరిగితే అందుకు సంబంధించిన సమాచారం నమోదు చేయాలన్నారు. ఎల్ ఆర్ ఎస్ దరఖాస్తుల పరిశీలన లో పురోగతి లేదని వాటి పరిశీలన లపై దృష్టి సారించాలని ఈ సందర్భం గా కమిషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్ డిప్యూటీ కమిషనర్లు రవీందర్ ప్రసన్న రాణి ఏసీపీ లు శ్రీనివాస్ రెడ్డి రజిత ఖలీల్ తదితరులు పాల్గొన్నారు


# పదవీ విరమణ పొందిన 15 మంది జిహెచ్ఎంసి ఉద్యోగులకు ఆత్మీయ వీడ్కోలు

**హైదరాబాద్, మహా :** ప్రతి ఉద్యోగికి తాము అందించిన సేవలతోనే గుర్తింపు లభిస్తుందని అడ్మిన్ జాయింట్ కమిషనర్ ఎస్.వి. జానకి రామ్ సాగర్ అన్నారు. జిహెచ్ఎంసి పరిధిలో వివిధ కేటగిరీల లో పనిచేసిన 15 మంది ఉద్యోగులకు ఉద్యోగ వయోపరిమితి పూర్తయిన నేపథ్యంలో జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయం లో శుక్రవారం రిటైర్మెంట్ వీడ్కోలు సభను నిర్వహించి, వారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్.వి జానకి రామ్ సాగర్ మాట్లాడుతూ... పదవీ విరమణ పొందుతున్న ఉద్యోగులందరూ తమ ఉద్యోగ జీవితంలో ఎంతో నిబద్ధత, అంకిత భావంతో సేవలందించారన్నారు. వారి కృషి, అందించిన సేవలు తమ సహచర ఉద్యోగులకు స్ఫూర్తిదాయకమన్నారు. రిటైర్మెంట్ అనేది జీవితంలో కొత్త అధ్యాయం లాంటిదని, రిటైర్మెంట్ పొందిన వారు వారి కుటుంబ సభ్యులతో సమయం గడుపుతూ, తమ ఆసక్తులకు ప్రాధాన్యం ఇస్తూ ఆరోగ్యంతో, ఆనందంగా గడపాలని ఆయన సూచించారు. వారి ముమ్మందు జీవితం ఆయురారోగ్యాలతో ఆనందంగా గడపాలని కోరారు.

పదవీ విరమణ పొందిన వారి వివరాలు: పి.రఘునందన్ రాజు (డిప్యూటీ సిటీ ప్లానర్), సుదర్శన్ (డిప్యూటీ ఇంజనీర్), ఇ. ధానేశ్వర్ (అసిస్టెంట్ సిటీ ప్లానర్), శ్రీమతి అజీజున్నీసా (సూపరింటెండెంట్), ఎస్.కృష్ణ (హెచ్.వి. డ్రైవర్), పి.రాములు (అటెండర్/ఛైన్ మెన్), పి.రమేష్ (నాన్ పి.హెచ్ వర్కర్), మహేందర్ రెడ్డి (శానిటరీ జవాన్), ఎన్.దుర్గయ్య (శానిటరీ జవాన్), కె.శ్రీహరి (మాన్ మజ్దూర్), బి.రాములు (లైన్ మెన్), శ్రీమతి రెహానా సుల్తానా (బిల్ కలెక్టర్), టి.వినోద్ సింగ్ (మాన్ మజ్దూర్), జగదీష్ (ఛైన్ మెన్), టి.శాంసన్ (స్వీపర్) ఉన్నారు.

# మీరు జైల్లో బిజీ ఉన్నప్పుడు కాళేశ్వరం వాస్తవాలు ప్రజలకు తెలిశాయి

**కవితపై ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ఫైర్**



**హైదరాబాద్, మహా:** ఫాంహౌజ్‌లో పడుకొని డిజైన్ చేయడం వల్లే కాళేశ్వరం ప్రాజెక్టు కూలిపోయిందని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. "నీళ్లు నిజాలు"పై రౌండ్ టేబుల్ సమావేశం లో ఎమ్మెల్సీ కవిత చేసిన ఆరోపణలపై ఆయన స్పందించారు. ఈ మేరకు తాజాగా ఒక వీడియో విడుదల చేశారు. మీరు అరెస్ట్ అయి జైల్లో బిజీ ఉన్నప్పుడు.. పేపర్లు చదువకనో మీకు తెల్వనట్లుంది.. కాళేశ్వరం విచారణ ఘోష్ కమిటీ, ఇంజనీర్లు, కన్‌స్ట్రక్షన్ కంపెనీలు కాళేశ్వరం కూలిపోవడానికి వాస్తవాలు తెలిపాయని వివరించారు. రాజకీయం, డైవర్షన్ పాలిటిక్స్ చేయడం కోసం కవిత మాట్లాడుతున్నారని అన్నారు. శ్రీరామ్ సాగర్, ఎల్లంపల్లి, దేవాదుల, నిజాం సాగర్, సింగూరు, మానేరు లాంటి 1935 నుంచి 2004 దాకా కాంగ్రెస్ హయాంలో గోదావరి జలాల మీద కట్టిన ప్రాజెక్టులు ఏవీ కూలిపోలేదని తెలిపారు. కానీ మీరు కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు మాత్రమే ఎందుకు కూలిపోయింది? అని ప్రశ్నించారు. రాజకీయం చేయడం కాదు.. ప్రజలకు వాస్తవాలు తెలియజేయాలన్నారు. నాడు పోతిరెడ్డి ప్రాజెక్టు నుంచి రోజుకు 2 టీఎంసీల నీళ్లు నాటి సీఎం జగన్ తీసుకుపోతున్నా నిమ్మకు నీరెత్తినట్లు ఉన్నారని ఆరోపించారు. కృష్ణా, గోదావరి జలాలను కాపాడుకునేందుకు దేనికైనా తెగిస్తాం.. తెలంగాణ ప్రజల చెవుల్లో పూలు పెట్టకండని ఎంపీ చామల విమర్శించారు.

# డ్రగ్స్ రహిత జిల్లాగా ములుగును తీర్చిదిద్దాలి

- సైబర్ క్రైమ్ నేరాలపై అవగాహన కల్పించాలి
- మావోయిస్టు కార్యకలాపాలపై నిఘా పెట్టాలి
- ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉండాలి
- హోంగార్డ్స్ , ఆర్గనైజేషన్ అడిషినల్ డీజీపీ స్వాతి లాక్రా






**ములుగు, మహా :** జిల్లాలో యువత డగ్స్ కు బానిసలు కాకుండా చర్యలు తీసుకొని, డగ్ రహిత జిల్లాగా ములుగు జిల్లాను తీర్చిదిద్దాలని హోం గార్డ్స్ , ఆర్గనైజేషన్ అడిషినల్ డీజీపీ స్వాతి లాక్రా పోలీసు అధికారులకు సూచించారు. వార్షిక తనీఖీల్లో భాగంగా శుక్రవారం ములుగు జిల్లా పోలీస్ తనీఖీకై వచ్చిన హోంగార్డ్స్ , ఆర్గనైజేషన్ అడిషినల్ డీజీపీ స్వాతి లాక్రా కు ఆర్ అండ్ బి అతిధి గృహం వద్ద ములుగు జిల్లా ఎస్పీ శబరీష్ పుష్పగుచ్చాలు అందజేసి స్వాగతం పలికగా సాయుధ పోలీసులు గౌరవవందనం చేశారు. ఈ తనీఖీలో భాగంగా ఆర్ అండ్ బి అతిథి గృహంలో ములుగు జిల్లాకు చెందిన పోలీస్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ములుగు జిల్లా విభాగం పనీతీరును, శాంతి భద్రత నియంత్రయణలో తీసుకుంటున్న ముందస్తు చర్యలపై జిల్లా ఎస్పీ శబరీష్ పవర్ పాయింట్ ప్రజేంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా అడిషనల్ డీజీపీ మాట్లాడుతూ నేర నియంత్రణలో ములుగు జిల్లా పోలీస్ చేస్తున్న కృషిని, శాంతి భద్రతల్లో తీసుకుంటున్న రక్షణ చర్య లను, లోక్ అదాలత్ ద్వారా కేసుల సత్వర పరిష్కారానికి చేస్తున్న కృషిని ప్రశంసించారు. సామాజిక మాధ్యమాల ద్వారా జరుగుతున్న ఆర్థిక నేరాల పై ములుగు జిల్లాలోని ప్రజలకు అవగాహణ కల్పించాలని సూచించారు. గ్రామీణ యువత నిషేధిత మావోయిస్టు భావజాలానికి లోను కాకుండా ఉద్యోగ అవకాశాలు కల్పించాలి అని, మావోయిస్టు కార్యకర్తలపై అనునిత్యం నిఘా ఉంచాలని, ములుగును మావోయిస్టు రహిత జిల్లాగా మార్చాలని ఆర్గనైజేషన్, హోంగార్డ్స్ అడిషినల్ డీజీపీ స్వాతి లక్రా అధికారులకు సూచించారు. అలాగే మహిళలకు సంబంధించి ఫిర్యాదులకు అధిక ప్రధాన్యత ఇవ్వాలని, మహిళ రక్షణకై ఏర్పాటయిన షీటీం పట్ల ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు, షీ టీంలో వచ్చే ఫిర్యాదులపై అధికారులు సున్నితంగా వ్యహహరించి బాధితులకు న్యాయం కల్పించడంతో పాటు నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. డయల్ 100 నుండి వచ్చే ఫిర్యాదులపై స్టేషన్ అధికారులు, సిబ్బంది తక్షణమే స్పందించి సంఘటన స్థలానికి చేరుకోవాలని, సైబర్ నేరాలకు సంబంధించి వచ్చే ఫిర్యాదులపై స్టేషన్ అధికారులు తప్పక కేసు నమోదు చేయాలన్నారు. కోర్టుల్లో ట్రయల్స్ లో ఉన్న కేసులను అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ ఉండాలని, రోడ్డు ప్రమాదాల నివారణ కోసం సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులు తగు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధానంగా విద్యార్థుల్లో ట్రాఫిక్, మత్తుపదార్థాలు , సైబర్ నేరాలు, ర్యాగింగ్ ల పై అవగాహన కల్పించేందుకు ప్రతి కళాశాలలో సేఫ్టీ వుమెన్, యాంటీ డ్రగ్స్, ట్రాఫిక్ స్టేఫ్టీ, ర్యాగింగ్ కు లోను కాకుండా యాంటీ ర్యాగింగ్ కమిటీలు, క్లబ్బులను ప్రతి పీఎస్ పరిధిలో ఏర్పాటు చేసి సంబంధిత అధికారులు పర్యవేక్షించాలన్నారు. వీటీపై ప్రజలకు అవగాహన కల్పించే విధంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని, బాలకార్మికుల వ్యవస్థ నిర్మూలనకోసం నిరంతరం తనీఖీలు కోనసాగించాలని అడిషినల్ డీజీపీ తెలిపారు. అనంతరం జాకారంలోని డిటిసి సెంటర్ ను, ఏఆర్ హెడ్ క్వార్టర్స్ లోని డాగ్ స్కాడ్, ప్రస్తుత డిపిఓ భవనాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమములో ములుగు జిల్లా ఓఎస్డి గీతే మహేష్‌బాబా సాహెబ్, ఏఆర్ అడిషనల్ ఎస్పీ సదానందం, ఏటూరునాగారం ఏ ఎస్ పి శివం ఉపాధ్యాయ ఐపీఎస్, ములుగు డి.ఎస్.పి రవీందర్ తో పాటు ఇన్స్పెక్టర్లు, ఆర్.ఐ లు, ఎస్సైలు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# కేసీఆర్ సీజనల్ ప్రతిపక్ష నేత

**పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఫైర్**

**హైదరాబాద్, మహా:** మాజీ సీఎం కేసీఆర్ సీజనల్ ప్రతిపక్ష నేతగా మారాడని పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు. గాంధీ భవన్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కేసీఆర్ ప్రజలను మోసం చేయడంలో దిట్ట అని పేర్కొన్నారు. అందుకే కేసీఆర్‌ని.. మోసగాళ్ళకు మోసగాడు అని కాంగ్రెస్ పార్టీ నామకరణం చేస్తుందన్నారు. పదేళ్ల కాలం సీఎంగా కేసీఆర్.. సచివాలయంలో మూడు రివ్యూలైనా చేశావా..? అని ప్రశ్నించారు. కేసీఆర్‌వి భక్వాస్ మాటలు అని, ఫామ్ హౌస్‌లో కూర్చొని ప్రజల్ని ఎలా మోసం చేయాలో ప్రాక్టీస్ చేస్తున్నారన్నారు. కేసీఆర్ ఐదు లక్షల మందితో సభ పెడితే, సీఎం రేవంత్ తక్కువోడా ఐదు లక్షల ఒక్క వేయి మందితో సభ పెడుతామన్నారు. కేసీఆర్‌కంటే ఎక్కువ మందితో సభ పెట్టి మగాళ్లకు మొగుళ్లను అనిపించుకుంటామని ఈ సందర్భంగా జగ్గారెడ్డి పేర్కొన్నారు. వాస్తవానికి అసెంబ్లీ పెట్టమని ప్రతిపక్ష నాయకుడు అడగాలని, కానీ ఇక్కడ ప్రభుత్వం అసెంబ్లీ పెట్టి ప్రతిపక్ష నాయకుడిని ప్రజల పక్షాన మాట్లాడాలంటున్న విషయం గుర్తుంచుకోవాలన్నారు.


# రైతు భరోసా టకీ టకీ ఇక్కడ కాదు..

**ఢిల్లీలో పడుతున్నాయ్**

**కేటీఆర్ విమర్శలు**

**హైదరాబాద్, మహా:** రైతు భరోసా పైసలు టకీ టకీ మని రైతుల ఖాతాల్లో పడకుండా టకీ టకీమని ఢిల్లీలో పడుతున్నాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. తెలంగాణ భవన్‌లో జరిగిన బీఆర్ఎస్ మున్సిపల్ చైర్‌పర్సన్లు, వైస్ చైర్‌పర్సన్ల సన్మాన కార్యక్రమంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాట్లాడారు. మోసపూరిత 420 హమీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌కు పాలన చేయడం రావడం లేదన్నారు. ఆరున్నర లక్షల కొత్త రేషన్ కార్డులను గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చినప్పటికీ, కాంగ్రెస్ పార్టీ రేషన్ కార్డులు ఇవ్వనేలేదు అంటూ అబద్ధాలు చెబుతుందని విమర్శించారు. సమైక్య రాష్ట్రంలో మున్సిపాలిటీలు అంటే మురికికూపాలుగా ఉండేవన్నారు. బల్దియాలు అంటే ఖాయా, పియా, చల్దియా అనే సామెత ఉండేదన్నారు. కానీ బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వతా కేసీఆర్ పట్టణాల అభివృద్ధి కోసం ప్రత్యేక విజన్‌తో పనిచేయాలని దిశానిర్దేశం చేశారని కేటీఆర్ చెప్పుకొచ్చారు. అందుకే అర్ధిక ఇంజన్లుగా ఉన్న పట్టణాలను, వాటి సమగ్రంగా డెవలప్ చేయాలని అనేక కార్యక్రమాలు చేపట్టామన్నారు. తెలంగాణ పట్టణాలకు పది సంవత్సరాల్లో అనేక జాతీయ అవార్డులు దక్కాయని గుర్తు చేశారు.

# జాతీయ స్థాయి పోటీలకు కుంట్లూర్ విద్యార్థినులు




**ఎల్బీనగర్, మహా:** రంగారెడ్డి జిల్లా పెద్ద అంబర్ పేట మున్సిపాలిటీ లోని కుంట్లూర్ కు చెందిన విద్యార్థినులు లంగ్డీ పోటీల్లో విజయం సాధించి, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. కుంట్లూర్ కు చెందిన వేముల శ్రీరాములు, శ్రీలత దంపతుల కుమార్తెలు యశశ్విని, యజ్ఞ వ్యాస్ మోడల్ స్కూల్ లో చదువుతున్నారు. క్రీడలపై ఆసక్తి ఉన్న యశశ్విని, యజ్ఞ లంగిడి పోటీల్లో ఉత్తమ ప్రతిభ చాటుతున్నారు.ఇటీవల కాటేదాన్ రవీ బ్రిలియంట్ స్కూల్ జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో విజయం సాధించి, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరితో పాటు రామందర్ ఎంపిక కాగా వీరందరూ ఈ నెల 31న తమిళనాడులో జరిగే నుండి వచ్చే నెల 2వరకు జరిగే పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. విద్యార్థినులను వ్యాస్ మోడల్ స్కూల్ చెర్మన్ సర్వేశ్వర్ రెడ్డి, ప్రిన్సిపాల్ విశాఖ, కోచ్ లు నీలేష్, శేఖర్ తదితరులు అభినందించారు.

# గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న 7 గురు చిన్నారులను గుర్తించిన వైద్యులు




**ములుగు, మహా :** ఆర్ బీఎస్ కె (డైక్ ) ఆధ్వర్యంలో వరంగల్ ఎంజీఎంలో అపోలో వైద్యులచే నిర్వహించిన క్యాంప్ లో వైద్యులు 7 గురు చిన్నారులు గుండె సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నారని గుర్తించినట్లు జిల్లా వైద్యాధికారి గోపాల్ రావు తెలియజేశారు. ఈ హెల్త్ క్యాంపుకు మొత్తం 27 మంది చిన్నారులు హాజరుకాగా 7 గురు చిన్నారులు గుండె సంబంధిత రుగ్మతలతో బాధపడుతున్నారని, అందులో 5 గురు చిన్నారులకు వెంటనే శస్త్ర చికిత్స చేయాల్సిన అవసరం ఉందని, మరో ఇద్దరికి రెండు నెలల తరువాత మళ్ళీ పరీక్షలు నిర్వహించి సమస్యను పూర్తి స్థాయి నిర్ధారణ చేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్బీఎస్కె ప్రోగ్రాం ఆఫీసర్ రణధీర్, ఆర్బీఎస్కే కోఆర్డినేటర్ నరహరి, డాక్టర్లు శ్రీలత, స్వప్న, ప్రత్యూష, వెంకటేష్, నవీన్, ఏఎన్ఎంలు రమ, సుభాషిని, నాగమణి, స్వరూప, విజయ తదితరులు పాల్గొన్నారు.




# రైతుభరోసా ఆపొద్దని ఈసికి లేఖ రాస్తాం

- ఎన్నికల కోడే అడ్డంకి అనుకుంటే బిజెపి తరుపున మేం సిద్ధం
- కేంద్రమంత్రి బండిసంజయ్

**హైదరాబాద్, మహా :** రాష్ట్ర వ్యాప్తంగా అర్హులైన ప్రతి ఒక్కరికి కొత్త రేషన్ కార్డులు ఇవ్వాలని కేంద్రమంత్రి బండిసంజయ్ డిమాండ్ చేశారు. లబ్ధిదారుల ఎంపికలో ఇళ్లల్లోని కుటుంబాలను ప్రమాణికంగా తీసుకోవాలని సూచించారు. ఒకవేళ 'రైతు భరోసా' నిధుల విడుదలలో ఎన్నికల కోడ్ తో సమస్య వస్తే.. అవసరమైతే బీజేపీ తరపున ఈసీకి లేఖ రాసేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈ విషయంలో తక్షణమే అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని.. అందరం కలిసి ఎలక్షన్ కమిషన్‌కు విజ్ఞప్తి చేద్దామని బండి సంజయ్ పిలుపునిచ్చారు. రైతు భరోసా ఆపవద్దని, కొనసాగించాలని కోరారు.



# తప్పిపోయిన వలస కార్మికుడు

**ఇబ్రహీంపట్నం, మహా:** ఆదిభట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో వలస కార్మికుడు, నమాజ్ కు వెళ్లిన వ్యక్తి తిరిగి రాలేదని పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసిన తోటి కార్మికులు. సిఐ రాఘవేందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం ఉత్తర ప్రదేశ్ కి చెందిన రహమత్ ఆలీ అనే వ్యక్తి పని నిమిత్తం వలస వచ్చి, మహేశ్వరం మండలం, రావిరాల ప్యాబ్ సిటీ వద్ద సీలింగ్ పనులు చేస్తున్నాడు. మధ్యాహ్నం సమయంలో నమాజ్ కు వెళ్లి తిరిగి రాకపోవడంతో, చుట్టుపక్కల ప్రాంతాలలో వెతికిన కనిపించకపోవడంతో, తోటి కార్మికులు ఆదిభట్ల పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. అతని వద్ద సెల్ ఫోన్ లేదని, హిందీ భాష మాత్రం క్షుణ్ణంగా మాట్లాడ గలడని తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నామని వెల్లడించారు. అతని ఆచూకీ తెలిసినవారు ఆదిభట్ల పోలీస్ స్టేషన్లో సమాచారం ఇవ్వాలని కుటుంబ సభులు, పోలీసులు కోరారు.

# ఇబ్రహీంపట్నం సీఐగా బాధ్యతలు స్వీకరించిన ఐ జగదీష్



**ఇబ్రహీంపట్నం, మహా:** ఇబ్రహీంపట్నం నూతన సీఐగా పదవి బాధ్యతలు స్వీకరించిన ఐ జగదీష్. గత నెల రోజులుగా మంచాల సీఐ మధును ఇన్చార్జిగా నియమించి, విధులు నిర్వర్తింపజేశారు. సిఐ జగదీష్ మాట్లాడుతూ ఇబ్రహీంపట్నంలోని ప్రజలకు అందుబాటులో ఉంటూ, శాంతి భద్రత కాపాడుతానని, తన విధి నిర్వహణలో పొరపాట్లు జరగకుండా చూసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఇప్పటివరకు మాడుగుల సిఐగా విధులు నిర్వహించారు.



నాగోబా జాతరలో సాంప్రదాయ దుస్తుల్లో

# అలరించిన నేతలు

- ఆదివాసీ కట్టు బొట్టు తో అలరించిన సీతక్క
- లాల్చీ ధోవతీలో ఆకట్టుకున్న కంది శ్రీనివాస రెడ్డి

**ఆదిలాబాద్, మహా :** నాగోబా జాతర లో ఆదివాసీ సంస్కృతీ సాంప్రదాయం ఉట్టి పడింది.మెస్రం వంశీయులే కాకుండా జాతర కొచ్చిన అతిధులు సాంప్రదాయ వస్త్ర ధారణ తో ఆకట్టుకున్నారు. సాంప్రదాయ కట్టు బొట్టు తో మంత్రి సీతక్క , లాల్చీలు ధోవతులతో ఎమ్మెల్సీ విఠల్ ,ఎమ్మెల్యే బొజ్జు పటేల్ , జీసీసీ చైర్మన్ కొట్నాక్ తిరుపతి , కరీంనగర్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేష్ , మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, ఆదిలాబాద్ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి,బోథ్ అసెంబ్లీ ఇంచార్జి ఆడె గజేందర్ లు జాతరలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.



### ఈ నెల 3 నుండి ఇంటర్మీడియట్
## ప్రాక్టికల్ పరీక్షలు
**జిల్లా ఇంటర్ విద్యాధికారి చంద్రకళ**

**ములుగు, మహా :** ఫిబ్రవరి 3వ తేదీ నుండి 22 వరకు ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు జరగనున్నట్లు ఇంటర్మీడియట్ జిల్లా విద్యాధికారి చంద్రకళ తెలిపారు. శుక్రవారం ములుగు జిల్లా జూనియర్ కళాశాలలో ప్రాక్టికల్ పరీక్ష సన్నాహక సమావేశము నిర్వహించగా చంద్రకళ హాజరై మాట్లాడారు. ప్రాక్టికల్ పరీక్షలకోసం ములుగు జిల్లాలో ఇంటర్ రెండు సంవత్సరాలకు గాను 1164 మంది విద్యార్థులు, ఒకేషనల్ 241 మంది విద్యార్థులకోసం మొత్తం 13 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, పరీక్షల నిర్వహణకు పరీక్ష కేంద్రాలలో కావలసిన ఏర్పాట్లు చేసుకోవాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. విద్యార్థులకు కావాల్సిన అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేసుకోవాలని, పరీక్షా సమయాలపై అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో డీఈసి 1 వీరేందర్ , డీఈసి 2 శ్రీనివాసు, ములుగు ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్ భగవద్ గీత, జిల్లాలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాల ముఖ్య పర్యవేక్షణ అధికారులు మరియు సంబంధిత సబ్జెక్టు లెక్చరర్లు పాల్గొన్నారు.

# నాగోబాను దర్శించుకున్న కంది శ్రీనివాస రెడ్డి







- సాంప్రదాయ వస్త్ర ధారణతో మంత్రి సీతక్క తో కలిసి ఆలయంలో ప్రత్యేక పూజలు
- శాలువాలతో సత్కరించి జ్ఞాపికలు బహుకరించిన ఆలయ నిర్వాహకులు

**ఆదిలాబాద్, మహా :** ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి కేస్లాపూర్ నాగోబాను దర్శించుకున్నారు.జిల్లా ఇంఛార్జి మంత్రి సీతక్క , ఎమ్మెల్సీ దండె విఠల్ , ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, జీసీసీ చైర్మన్ కొట్నాక్ తిరుపతి, టీపీసీసీ కార్యదర్శి కరీంనగర్ జిల్లా గ్రాంధాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేష్ మల్లేష్, మాజీ ఎంపీ సోయం బాపూరావు, బోథ్ ఇంచార్జి ఆడె గజేందర్, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, మహిళానాయకురాలు ఆత్రం సుగుణ తో కలిసి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటి వారికి సాంప్రదాయ రీతిలో స్వాగతం పలికి శాలువాలతో సత్కరించి నాగోబా జ్ఞాపికలను బహుకరించారు.తీర్థ ప్రసాదాలు అందించారు.అనంతరం నాగోబా దర్బార్ కు హాజరయ్యారు.అంతకు ముందు ఉట్నూర్ లో ఆత్రం సుగుణ నివాసంలో మంత్రి సీతక్కను కలుసుకుని ఇంద్రవెల్లి అమరుల వీరుల స్థూపాన్ని సందర్శించారు.అమరులను నివాళ్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి , జంగు పటేల్, దుర్గం శేఖర్ , డేరా కృష్ణా రెడ్డి , జాంటీ తదితరులు పాల్గొన్నారు.



## ముగిసిన నాగోబా దర్బార్
- సమస్యలపై చర్చించిన కలెక్టర్..పరిష్కరిస్తామని వెల్లడి

**ఆదిలాబాద్, మహా :** కేస్లాపూర్ నాగోబా జాతర సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజర్షి షా, జిల్లా ఎస్పి గౌస్ ఆలం, ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, అదనపు కలెక్టర్ శ్యామలా దేవి శుక్రవారం నిర్వహించిన నాగోబా దర్బార్ లో ఏర్పాటు చేసిన స్టాల్స్ ను పరిశీలించి నాగోబా ఆలయం లో ప్రత్యేక పూజలు చేసారు. అనంతరం కొమురంభీమ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి, మెస్రం వంశీయులు బస చేసిన గోవడ్, భక్తులకు కల్పించిన వసతులను, వారు తయారు చేస్తున్న వంటలను పరిశీలించారు. తర్వాత నాగోబా దర్బార్ లో కలెక్టర్ మాట్లాడుతూ జాతర లో ఏర్పాటు చేసిన స్టాల్ లో ఆర్జీదారులు తమ సమస్యల పై దరఖాస్తులను సమర్పించుటకు అన్ని శాఖలకు సంబంధించిన కౌంటర్ లు ఏర్పాటు చేసామన్నారు సంబంధిత అధికారులు అర్జీలను స్వీకరిస్తారని తెలిపారు.గతంలో స్వీకరించిన దరఖాస్తులను ఐటీడీఏ పీవో తో కలసి పరిష్కరించామన్నారు. కమిటి సభ్యులు తెలిపిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.ఐటీడీఏ ద్వారా అనేక సంక్షేమ పథకాలు అమలు చేయడం, అన్ని ఆశ్రమ పాఠశాలలో గిరిజన పోషణ మిత్ర ఏర్పాటు చేసామన్నారు. ఆరోగ్య పాఠశాల కు శ్రీకారం చుట్టి విద్యార్థుల్లో అవగాహనను కల్పించడం జరుగుతుందని అన్నారు. భారత దేశంలో రెండవ అతిపెద్ద గిరిజన జాతర విశిష్టత పై దేశ నలుమూలల తెలిసేలా కార్యక్రమాలు చేపట్టాలని, మెస్రం వంశీయుల కట్టుబాట్లు, సంస్కృతి సంప్రదాయాలు ఇప్పటికీ కొనసాగుతున్నాయని అన్నారు.తొలిసారి 1942లో నిర్వహించిన దర్బార్



హేమన్ డార్ఫ్ ఆధ్వర్యంలో జరిగిందని, నాగోబా జాతర సందర్భంగా ఈ సారి నాగోబా సన్నిధిలో నిర్వహించే దర్భారు కు 78 సంవత్సరాలు పూర్తి చేసుకొని 79 లోకి అడుగుపెడుతున్నదని అన్నారు. ఈ దర్బార్ లో గిరిజనులు అధికారుల వద్ద తమ సమస్యలను విన్నవించి అధికారుల ద్వారా వారి వినతులు పరిష్కారం అయ్యేవని ఆసియాలో 2 వ అతిపెద్ద ఆదివాసీ వేడుక నాగోబా జాతర వైభవంగా కొనసాగుతోందన్నారు .గత మూడు రోజుల నుండి నాగోబా జాతరకు భక్తుల రద్దీ ఎక్కువగా పెరుగుతుందని, నాగోబ జాతరలో దర్బార్ నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు.ఈ కార్యక్రమంలో అటవీ శాఖ అధికారి ప్రశాంత్ బాజీరావ్ పాటిల్, ఉట్నూర్ ఏఎస్పీ కాజల్, ఎఫ్ డీవో రేవంత్ చంద్ర, సబ్ కలెక్టర్ యువరాజ్, ట్రైనీ కలెక్టర్ అభి గ్యాన్ , ఆలయ కమిటీ అధ్యక్షులు, సభ్యులు, మెస్రం వంశీయులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి



**వరంగల్, మహా:** ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పేర్కొన్నారు. జిల్లా రోడ్ల భవనాల అధికారి జితేందర్ రెడ్డి, మిషన్ భగీరథ ఈఈ వెంకటరమణారెడ్డి, జిల్లా ఉపాధి కల్పనా ఉమారాణి పదవీ విరమణ సందర్భంగా శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పదవి విరమణ పొందుతున్న అధికారులు జిల్లాలో ప్రధాన శాఖలను నిర్వర్తిస్తూ నిత్యం ప్రజలకు అందుబాటులోకి ఉంటూ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేశారన్నారు. వారు విధుల పట్ల నిబద్దతో పనిచేశారని, తోటి అధికారులు, సిబ్బందితో స్నేహభావంగా ఉంటూ క్రమ శిక్షణతో విధులు నిర్వహించాలని అన్నారు. పదవి విరమణ పొందుతున్న అధికారులతో కలిసి గత ఏడు నెలల్లో జిల్లాలో కాకతీయ మెగా టెక్స్టైల్ పార్క్ విమానాశ్రయం, సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వంటి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని కలెక్టర్ గుర్తు చేశారు. వారి సేవలను అధికారులు స్ఫూర్తిగా పదవీ విరమణ ముగింపు కాదని, కొత్త ఆరంభమని, వారు తమ అభిరుచులను కొనసాగించేందుకు ఇదొక అవకాశం అని కలెక్టర్ ఉద్ఘాటించారు. అనంతరం పదవి విరమణ పొందుతున్న ముగ్గురు అధికారులను కలెక్టర్, అధికారులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించి మొమెంటోలను అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జెడ్పి సీఈఓ రామిరెడ్డి, డిఆర్డీఓ కౌసల్యాదేవి, జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ, టీడబ్ల్యూ ఐడిసి ఎస్ఈ నరేందర్ రెడ్డి, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.




## పీఎం అవార్డ్స్ కు ప్రతిపాదనలను వెబ్‌సైట్‌లో నమోదు చేయాలి
**వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**

**వరంగల్, మహా:** పీఎం అవార్డ్స్ కోసం తగిన ప్రతిపాదనలతో వివరాలను వెబ్ సైట్ లో నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ లోని కలెక్టర్ ఛాంబర్ లో శుక్రవారం సాయంత్రం సంబంధిత శాఖల అధికారులతో జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. 2022 ఏప్రిల్ నుంచి 2024 డిసెంబరు ఆఖరు వరకు వివిధ కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుకు సంబంధించిన వివరాలతో సమగ్ర నివేదికలను రూపొందించాలన్నారు. పీఎం అవార్డుల కోసం మొత్తం మూడు కేటగిరీలలో 14 అంశాలకు సంబంధించిన వివరాలను వెబ్ సైట్ లో నమోదు చేయాలన్నారు. హర్ ఘర్ జల్ యోజన, ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన, పీఎం విశ్వకర్మ, ప్రధానమంత్రి ఆవాస్‌యోజన, పీఎం స్వా నిధి, అంగన్‌వాడీ, పోషన్ అభియాన్, ప్రధానమంత్రి మాతృ వందన యోజన, పీఎం సూర్య ఘర్ ముఫ్త్‌బిజిలి యోజన, మిషన్ ఇంద్రధనస్సు, రైతులు, మత్స్యకారులు, పశుపోషకులకు కిసాన్ క్రెడిట్



కార్డుల పథకం అమలు చేస్తున్న వివరాలను సమగ్రంగా నివేదించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో ఆదనపు కలెక్టర్ సంధ్యారాణి, డి ఆర్ ఓ విజయలక్ష్మి, ఆయా శాఖల అధికారులు డిఆర్డీఓ కౌసల్యాదేవి, జెడ్పి సీఈఓ రామిరెడ్డి, డిఎఓ అనురాధ, డిఎం హెచ్ ఓ డాక్టర్ సాంబశివరావు, డివి హెచ్ ఓ బాలకృష్ణ, డిపిఆర్ఈ ఇజ్జగిరి, డిసిపిఓ శ్రీదేవి, బల్దియా ఉప కమిషనర్ ప్రసన్నారాణి, మెప్మా టీఎంసీ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆటో, ఆర్టీసీ బస్సు ఢీ
**ఒకరు మృతి..దర్యాప్తు చేస్తున్న పోలీసులు**



**ఆదిలాబాద్, మహా :** ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలంలోని కుచులాపూర్ వెంకటేశ్వర ఆలయ సమీపంలో రహదారిపై ఆటో, బస్సు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. నిర్మల్ జిల్లా చిట్యాల గ్రామానికి చెందిన ఏనుగు లక్ష్మారెడ్డి (55) బోథ్ మండలం ధన్నూర్'బి' గ్రామంలో ఉండే తన కూతరు మార లావణ్యరెడ్డి ఇంటికి 5 క్వింటాళ్ల బియ్యాన్ని తీసుకొని ఆటోలో వస్తున్నాడు. కాగా మండలంలోని కుచులాపూర్ వెంకటేశ్వర ఆలయ సమీపంలో బోథ్ నుంచి ఆదిలాబాద్ వెళ్తున్న ఆర్టీసీ బస్సును నిర్మల్ నుంచి బోథ్ వైపు ఎదురుగా వస్తున్న ఆటో డ్రైవర్ గంజేవార్ వసంతకృష్ణ వేగంగా ఢీకొట్టాడు. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న లక్ష్మారెడ్డి అక్కడికక్కడే మృతి చెందగా డ్రైవర్ వసంతకృష్ణ తీవ్ర గాయాలపాలయ్యాడు. అతన్ని నిర్మల్ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మృతుడి అల్లుడు మార జైపాల్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎల్.ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

## ఇంటింటికి వెళ్లి మిషన్ భగీరథ త్రాగునీటి సరఫరా పై ఆరా తీయాలి
**నీటి సరఫరాకు మూడు నెలలకు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసుకోవాలి**



**జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.**

**ములుగు, మహా :** మిషన్ భగీరథ తాగునీటి సరఫరాపై ఇంటింటా తిరుగుతూ ఆరాతీయాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ లో జరిగిన సమావేశ మందిరంలో మిషన్ భగీరథ వాటర్ సప్లై పై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షా సమేవేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని ముందస్తు చర్యల్లో భాగంగా ప్రతీ ఇంటికి వెళ్ళి మిషన్ భగీరథ నీటి సరఫరాపై అడిగి తెలుసుకోవాలని, ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ మూడు నెలలకు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సూచించారు. గత సంవత్సరం జరిగిన అనుభవాలను దృష్టిలో పెట్టుకొని వేసవిలో త్రాగునీటి సమస్యలు రాకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపట్టాలన్నారు. గ్రామాల్లో ప్రజలకు నీటి సమస్యలు తెలత్తకుండా గ్రామాలకు సమీపంలో ఉన్న బావులు, చెరువులు, హ్యాండ్ పంపులు, లోకల్ బోర్వెల్స్, ట్యూబ్ వెల్స్, వ్యవసాయ బోర్లు గుర్తించి వాటి ద్వారా నీటి సరఫరా చేసేవిధంగా ముందస్తుగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని అన్నారు. ఈ సమవేశంలో మిషన్ భగీరథ వరంగల్ సి ఈ కె. సురేష్ , ఎస్ ఈ మల్లేశం, ఆర్డబ్ల్యూఎస్ డీఈలు, ఏఈలు, 9 మండలాల ఎంపీడీవోలు, జిల్లాలోని పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

## వరంగల్ లో గద్దర్ జయంతి సంబురాలు




**వరంగల్, మహా:** జేబి కల్చరల్ ఆర్ట్ సొసైటీ జడల శివ ఆధ్వర్యంలో వరంగల్ గోపాల స్వామి గుడి సెంటర్ లో గద్దర్ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించార ఈ సందర్భంగా రోజా క్రియేషన్ అధ్యక్షులు ఆలేటి శ్యామ్ మాట్లాడుతూ అణగారిన బతుకులో పాట నిలిచిన యోధుడు గద్దర్ లాంటి మహనీయుని జయంతి జరుపుకోవాలని గద్దర్ పాట రూపంలో మనందరి గొంతులో ఉన్నాడని పాటల రూపంలో బ్రతికే ఉంటాడని అన్నారు. తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్కెస్ట్ర సింగర్ రాము సకల కళా సాంస్కృతిక మండలి అధ్యక్షులు గడ్డం సుధాకర్ హంసలేక మధుసూదన్ హోస సంస్థ అధినేత గజ్జి దినకర్ శిరబోయిన రాజు రమేష్ భాస్వరాజ్ రమేష్ కట్టమల్లు తదితరులు పాల్గొన్నారు కేట్ కట్ చేసి జయంతి సంబురాలు నిర్వహించడం జరిగింది



## రహదారి భద్రత మన అందరి బాధ్యత
- ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలు రక్షించాలి
- జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.

**ములుగు, మహా :** రహదారి భద్రత మన అందరి బాధ్యత అని, సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా మసోత్సవం ముగింపు సందర్భంగా శుక్రవారం జిల్లా కేంద్రం లోని రవాణా శాఖ కార్యాలయం నుంచి 'రహదారి సురక్ష అభియాన్‌శ్రద్ధ రోడ్డు భద్రత' అవగాహన ర్యాలీని జిల్లా కలెక్టర్ దివాకర టి. ఎస్. జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సామాజికబాధ్యతగా ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని అన్నారు. రహదారి భద్రత మన అందరి బాధ్యత అని, సామాజిక బాధ్యతగా రోడ్డు భద్రతపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలు రక్షించాలని సూచించారు. రోడ్డు భద్రత మాసోత్సవాలను జనవరి 1 నాడు ప్రారంభించి జిల్లాలో రవాణా శాఖ అధికారులు ట్రాఫిక్ రూల్స్ పై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారని తెలిపారు. సామాజిక బాధ్యతగా రోడ్డు భద్రత లో ప్రజలు భాగస్వామ్యం అయితే ప్రమాదాలు నివారించవచ్చని ఆయన తెలిపారు. వాహనాలను అందరూ జాగ్రత్తగా నడపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రవాణా శాఖ అధికారి శ్రీనివాస్, సంబంధిత అధికారులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఎం.జీ.ఎం. సూపరింటెండెంట్ డాక్టర్. కిశోర్ కు సన్మానం
**వరంగల్ డిఎంహెచ్వో డాక్టర్. సాంబశివరావు**



**వరంగల్, మహా:** ఎం.జీ.ఎం.ఆస్పత్రి సూపరింటెండెంటీగా ప్రస్తుతం ఇన్చార్జీగా కొనసాగుతున్న డాక్టర్ కిశోర్ ను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పూర్తి స్థాయిలో గురువారం బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా వరంగల్ డి.ఎం. అండ్.హెచ్.ఓ డాక్టర్. బీ. సాంబశివరావు శాలువాతో సన్మానం చేసి పూల తోటి అందజేశారు. ఎంజీఎం హాస్పిటల్లో పేద ప్రజలకు సేవలు అందిస్తున్న మీకు ప్రత్యేక ధన్యవాదాలు సేవలు విలువైనయాన్ని డిఎం అండ్ హెచ్ ఓ సూపరింటెండెంట్ కిషోర్ ను కొనియాడారు. ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట డిప్యూటీ డి ఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ మోహన్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.



## క్రీడలలో గెలుపోటములు సహజం
**బల్దియా కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే**

**వరంగల్, మహా :** క్రీడలలో గెలుపోటములు సహజమని బల్దియా కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే అభిప్రాయ పడ్డారు. బల్దియా ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్ లో ఏర్పాటు చేసిన బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమం లో కమిషనర్ పాల్గొని విజేతలకు ట్రోఫీ లను షీల్డ్ లను అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గణతంత్ర దినోత్సవం ను పురస్కరించుకొని బల్దియా పరిధిలోని కార్పొరేటర్లు కాంట్రాక్టర్లు, మీడియా, అధికారులు, సిబ్బందికి క్రికెట్, షటిల్, క్యారమ్స్, చెస్, క్యారమ్స్, టగ్ ఆఫ్ వార్, మ్యూజికల్ చైర్, బ్యాడ్మింటన్ తదితర క్రీడాంశాలలో పోటీలు నిర్వహించడం జరిగిందని, క్రీడాకారులు వారి నైపుణ్యాన్ని ప్రదర్శించి క్రీడా స్ఫూర్తిని చాటారని, ఇలాంటి క్రీడలు ఉద్యోగులు సిబ్బందికి మానసిక శారీరక దృఢత్వాన్ని కలిగిస్తాయని అన్నారు. స్వతహాగా తాను కూడా ఒక క్రీడాకారిణి అని చిన్నతనం నుండే తనకు క్రీడల పట్ల మక్కువ ఉందని, ప్రతి 3 నెలలకు ఒకసారి ఇలాంటి పోటీలు నిర్వహించడానికి గల అవకాశాలను పరిశీలిస్తామని కమిషనర్ తెలిపారు. ఈ సందర్భం గా క్రికెట్ పోటీలో విజేతగా నిలిచిన శానిటేషన్ జట్టు రన్నర్ గా నిలిచిన టౌన్ ప్లానింగ్ జట్లకు కమిషనర్ ట్రోఫీ లను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ జోనా, ఎస్ ఈ ప్రవీణ్ చంద్ర సీఎంహెచ్వో రాజారెడ్డి హెచ్ ఓ రమేష్ ఇన్చార్జి సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్ డిప్యూటీ కమిషనర్లు ప్రసన్న రాణి రవీందర్ సీఎం హెచ్ ఓ డాక్టర్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# యమహా బంపరాఫర్..

## యమహా ఎంటీ-03పై భారీగా ధర తగ్గింపు..

ప్రముఖ ద్విచక్ర వాహనాల తయారీ సంస్థ యమహా మోటార్ ఇండియా (Yamaha Motor India) బైక్ రైడర్లకు తీపి కబురందించింది. యమహా ఎంటీ 03 (Yamaha MT03) మోటారు సైకిల్‌పై భారీగా ధర తగ్గించింది. శనివారం (2025 ఫిబ్రవరి 1) నుంచి రూ.1.10 ధర తగ్గిస్తున్నట్లు శుక్రవారం తెలిపింది. ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి యమహా ఎంటీ03 (Yamaha MT03) మోటార్ సైకిల్ రూ. 3.49 లక్షలు (ఎక్స్ షోరూమ్) పలుకుతుంది. ప్రీమియం మోటారు సైకిళ్ల సెగ్మెంట్‌లో కేటీఎం డ్యూక్ 390 (KTM Duke 390), బీఎండబ్ల్యూ జీ 310 ఆర్ (BMW G310 R)మోటార్ సైకిళ్లకు యమహా ఎంటీ03 మోటార్ సైకిల్ పోటీ ఇస్తుంది. యమహా ఎంటీ03 (Yamaha MT03) మోటారు సైకిల్ కంప్లీట్‌లీ బిల్ట్ అప్ (సీబీయూ) రూపంలో విదేశాల నుంచి దిగుమతి అవుతుంది. యమహా ఎంటీ03 మోటార్ సైకిల్ లాంచింగ్ ధర రూ. 4.60 లక్షలు (ఎక్స్ షోరూమ్) కాగా, రూ.1.10 లక్షల ధర తగ్గింపుతో రూ.3.49 లక్షల (ఎక్స్ షోరూమ్)కు లభిస్తుంది. కేటీఎం డ్యూక్ 390 మోటార్ సైకిల్ ధర రూ.3.13 లక్షలు (ఎక్స్ షోరూమ్) పలుకుతుంది.

**ఇవీ యమహా ఎంటీ-03 ఇంజిన్ స్పెషిఫికేషన్స్**

యమహా ఎంటీ03 (Yamaha MT03) మోటార్ సైకిల్ 321సీసీ లిక్విడ్ కూల్డ్, ట్విన్ సిలిండర్ ఇంజిన్‌తో వస్తోంది. ఈ ఇంజిన్ 10,750 ఆర్పీఎం వద్ద 41 బీహెచ్‌పీ విద్యుత్, 9,000 ఆర్పీఎం వద్ద 29.5 ఎన్ఎం టార్క్ వెలువరిస్తుంది. 6స్పీడ్ గేర్‌బాక్స్‌తో వస్తోంది. యమహా ఎంటీ03 మోటార్ సైకిల్ సీటు 780 మి.మీ ఎత్తు, 1380 మిమీ వీల్ బేస్, 160 మిమీ గ్రౌండ్ క్లియరెన్స్, 167 కిలోల వెయిట్ ఉంటుంది. ఫ్రంట్‌లో 298 ఎంఎం డిస్క్, 220 ఎంఎం రేర్ డిస్క్ ఉంటాయి. ఈ రెండు డ్యుయల్ చానెల్ ఏబీఎస్‌తో వస్తున్నాయి.

**యమహా ఎంటీ-3 – స్పెషిఫికేషన్స్**

ఇంజిన్ - 321సీసీ లిక్విడ్ కూల్డ్
పవర్ - 10,750 ఆర్పీఎం వద్ద 41 బీహెచ్‌పీ
టార్క్ - 9,000 ఆర్పీఎం వద్ద 29.5 ఎన్ఎం
గేర్ బాక్స్ - 6 స్పీడ్

**మోటారు సైకిల్ – ధర (ఎక్స్ షోరూమ్)**

యమహా ఎంటీ3 - రూ.3.49 లక్షలు
కేటీఎం 390 డ్యూక్ - రూ.3.13 లక్షలు
బీఎండబ్ల్యూ జీ 310 ఆర్ - రూ.2.90 లక్షలు



# బడ్జెట్‌కు ముందు రోజు బంగారం రికార్డ్ ర్యాలీ ఒక్కరోజే రూ.1,100 వృద్ధి..

## రూ.95వేలకు కిలో వెండి..కారణమిదే..!



గత జూలైలో బంగారం, వెండి దిగుమతులపై సుంకాలు తగ్గించిన కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ శనివారం వచ్చే ఆర్థిక సంవత్సర (202526) వార్షిక బడ్జెట్ ప్రవేశ పెట్టనున్నారు. నిర్మలా సీతారామన్ దిగుమతి సుంకాలు తగ్గించడంతో కొద్ది రోజులు స్వల్పంగా బంగారం ధరలు తగ్గినా.. యూఎస్ ఫెడ్ రిజర్వ్ కీలక వడ్డీ రేట్లు తగ్గించినా.. తాజాగా అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన డొనాల్డ్ ట్రంప్ ఆర్థిక విధానాలపై దృష్టి సారించిన ఇన్వెస్టర్లు.. తమ పెట్టుబడులకు స్వర్గధామంగా బంగారాన్ని పరిగణిస్తున్నారు. శనివారం ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశ పెట్టే బడ్జెట్ సానుకూలంగా ఉంటుందన్న అంచనాల మధ్య దేశీయ బులియన్ మార్కెట్‌లో బంగారం ధగధగ మెరిసింది. శుక్రవారం దేశ రాజధాని ఢిల్లీలో తులం బంగారం (99.9 శాతం స్వచ్ఛత) ధర రూ.1100 వృద్ధితో రూ.84,900 పలికింది. జనవరి ఒకటో తేదీ నుంచి తులం బంగారం ధర రూ.5,510 (7 శాతం) పెరిగింది. జనవరి ఒకటో తేదీన తులం బంగారం ధర రూ.79,390 పలికింది. 99.5 శాతం స్వచ్ఛత గల బంగారం తులం ధర కూడా రూ.1,100 పెరిగి రూ.84,500లతో జీవిత కాల గరిష్టాన్ని తాకింది. గురువారం తులం బంగారం ధర రూ. 83,400 వద్ద స్థిర పడిన సంగతి తెలిసిందే. శుక్రవారం కిలో వెండి ధర రూ.850 వృద్ధితో రూ. 95,000 వద్ద ముగిసింది. గురువారం కిలో వెండి ధర రూ.94,150 వద్ద స్థిర పడింది. 'అంతర్జాతీయ మార్కెట్‌లో బంగారం బుల్లిష్‌గా ఉంది. స్పాట్ గోల్డ్ తులం ధర ఇంట్రాడే ట్రేడింగ్‌లో ఔన్స్ బంగారం 2,800 డాలర్లు పలికింది. ఢిల్లీలో స్పాట్ గోల్డ్ ధర రూ.84,000మార్క్‌ను దాటేసింది" అని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ కమోడిటీస్ సీనియర్ అనలిస్ట్ సౌమిల్ గాంధీ చెప్పారు. ఫ్యూచర్స్ మార్కెట్ - మల్టీ కమోడిటీ ఎక్స్చేంజ్ (ఎంసీఎక్స్)లో ఫిబ్రవరి డెలివరీ గోల్డ్ కాంట్రాక్ట్స్ తులం బంగారం ధర రూ.487 (0.6 శాతం) పెరిగి రూ.82,210లతో మరో జీవిత కాల గరిష్ట రికార్డు నమోదు చేసింది. ఏప్రిల్ కాంట్రాక్ట్స్ తులం బంగారం ధర రూ.371 (0.45శాతం) పుంజుకుని తాజాగా రూ.82,415 జీవిత కాల గరిష్ట స్థాయికి చేరుకుంది. మార్చి డెలివరీ కిలో కాంట్రాక్ట్స్ వెండి ధర రూ.403 (0.43 శాతం) పెరిగి రూ.93,849 వద్ద ముగిసింది. ఇంట్రాడే ట్రేడింగ్‌లో రూ. 629 (0.67 శాతం) పెరిగి రూ.94,075లకు చేరుకున్నది. అంతర్జాతీయంగా కామెక్స్ గోల్డ్ ఫ్యూచర్స్‌లో ఏప్రిల్ డెలివరీ బంగారం ఔన్స్ ధర రూ.2,842.40 డాలర్లతో స్థిర పడింది. ఇంట్రాడే ట్రేడింగ్‌లో 2,859.45 డాలర్లతో గరిష్టాన్ని తాకిందని కోటక్ సెక్యూరిటీస్ పేర్కొంది. గతేడాది అక్టోబర్‌లో బంగారం ఫ్యూచర్స్‌లో ఔన్స్ బంగారం ధర 2,859.50 డాలర్లతో జీవిత కాల గరిష్టాన్ని తాకింది. మెక్సికో, కెనడా దేశాలపై సుంకాలు విధిస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించడంతో ఇన్వెస్టర్లు బంగారాన్ని ఆల్టర్నేటివ్ ఇన్వెస్ట్‌మెంట్ ఆప్షన్‌గా పరిగణిస్తున్నారు. కామెక్స్ సిల్వర్ ఫ్యూచర్స్‌లో మార్చి కాంట్రాక్ట్స్ ఔన్స్ వెండి ధర 0.31 శాతం వృద్ధితో 32.60 డాలర్లు పలికింది.

# ఎల్ & టీ, ఐటీ స్టాక్స్ దన్నుతో సెన్సెక్స్ 740 పాయింట్లు లబ్ధి.. 23,500 ఎగువన నిఫ్టీ..!



దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా నాలుగో రోజు లాభాలతో ముగిశాయి. శనివారం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వచ్చే ఆర్థిక సంవత్సరా (2025 26) నికి ప్రవేశ పెట్టనున్న వార్షిక బడ్జెట్ సానుకూలంగా ఉంటుందన్న అంచనాల మధ్య శుక్రవారం ఎల్ అండ్ టీ, ఐటీ స్టాక్స్ మద్దతుతో పుంజుకున్నాయి. వచ్చే ఆర్థిక సంవత్సరం వృద్ధిరేటు 6.36.8 శాతం మధ్య ఉంటుందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ శుక్రవారం సమర్పించిన ఆర్థిక సర్వే కూడా దేశీయ స్టాక్ మార్కెట్లకు ఊతమిచ్చింది. బీఎస్ఈ ఇండెక్స్ సెన్సెక్స్ 740.76 పాయింట్లు లబ్ధి పొందితే, ఎన్ఎస్ఈ సూచీ నిఫ్టీ 258.90 పాయింట్లు పుంజుకుని 23,500 పాయింట్ల ఎగువన 23,508.40 పాయింట్ల వద్ద స్థిర పడింది. నెస్లే ఇండియా, ఇండస్ ఇండ్ బ్యాంక్ నాలుగు శాతం చొప్పున లాభ పడ్డాయి. అంతర్గత ట్రేడింగ్‌లో బీఎస్ఈ సెన్సెక్స్ 790.11 పాయింట్ల లబ్ధితో 77,549.92 పాయింట్ల గరిష్టానికి దూసుకెళ్లింది. ఎన్ఎస్ఈ సూచీ నిఫ్టీ 281.2 పాయింట్ల వృద్ధితో 23,530.70 పాయింట్ల గరిష్ట స్థాయికి చేరుకుంది. బీఎస్ఈ 30 సెన్సెక్స్‌లో టైటాన్, ఇండస్ ఇండ్ బ్యాంక్, మారుతి, ఐటీసీ భారీగా లబ్ధి పొందగా, ఐటీసీ హోటల్స్, బజాజ్ ఫిన్ సర్వ్, భారతీ ఎయిర్ టెల్, ఐసీఐసీఐ బ్యాంకు నష్టపోయాయి. ఆసియా మార్కెట్లలో టోక్యో మార్కెట్ పాజిటివ్‌గా ముగిసింది. సియోల్ నష్టపోగా, షాంఘై, హాంకాంగ్ స్టాక్ మార్కెట్లకు శుక్రవారం సెలవు. అమెరికా మార్కెట్లు గురువారం లాభాలతో ముగిశాయి. గురువారం భారత్ ఈక్విటీ మార్కెట్లలో విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.4,582.95 కోట్ల విలువైన వాటాలు కొనుగోలు చేశారు. బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర 0.13 శాతం పుంజుకుని 76.97 డాలర్లు పలుకుతోంది.




# దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL



# ర్యాగింగ్‌తో హింసించారు, టాయిలెట్ సీటు నాకించారు

### కుమారుడి ఆత్మహత్యపై తల్లి లేఖ



**తిరువనంతపురం:** తన కుమారుడితో టాయిలెట్ సీటును బలవంతంగా నాకించారని, తల లోపల ఉంచి ఫ్లష్ చేశారని విద్యార్థి తల్లి ఆరోపించింది. స్కూల్‌లో నిరంతరం ర్యాగింగ్, బెదిరింపులు అతడ్ని ఆత్మహత్యకు ప్రేరేపించాయని తెలిపింది. సీఎం కార్యాలయంతోపాటు, డీజీపీకి ఈ మేరకు లేఖ ద్వారా ఫిర్యాదు చేసింది. జనవరి 15న కేరళలోని ఎర్నాకుళంలో అపార్ట్‌మెంట్ బిల్డింగ్ 26వ అంతస్తు నుంచి కిందకు దూకి 15 ఏళ్ల మిహిర్ ఆత్మహత్య చేసుకున్నాడు. కుమారుడి మరణంపై కలత చెందిన తల్లిదండ్రులు అతడి సూసైడ్‌కు దారి తీసిన కారణాల సమాచారాన్ని సేకరించారు. మిహిర్ స్నేహితులు, స్కూల్‌లోని విద్యార్థులను కలిశారు. అలాగే సోషల్ మీడియా పోస్ట్‌లు, మెసేజ్‌లను పరిశీలించారు. స్కూల్‌లో విద్యార్థుల ర్యాగింగ్, హింసను తట్టుకోలేక కుమారుడు ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుసుకుని షాక్ అయ్యారు. కాగా, మిహిర్ తల్లి రజ్నా ఈ దారుణ విషయాలను లేఖ ద్వారా మీడియాకు వెల్లడించింది. స్టూడెంట్స్ గ్యాంగ్ స్కూల్‌లో, బస్సులో తన కుమారుడ్ని తిట్టడంతోపాటు కొట్టి హింసించినట్లు ఆమె ఆరోపించింది. చివరి రోజున కూడా ఊహించలేని అవమానాన్ని అతడు భరించాడని తెలిపింది. 'బలవంతంగా వాష్‌రూమ్‌కు తీసుకెళ్లారు. టాయిలెట్ సీటును నాకమని బలవంతం చేశారు. టాయిలెట్‌ను ఫ్లష్ చేసి తల లోపల ఉంచారు. ఈ క్రూరమైన చర్యలు అతడిని తట్టుకోలేనిగా చేశాయి. స్కూల్ నుంచి ఇంటికి తిరిగి వచ్చిన తర్వాత నా కుమారుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు' అని అందులో పేర్కొంది. మరోవైపు తన కుమారుడి చర్మం రంగు వల్ల కూడా అతడ్ని లక్ష్యంగా చేసుకున్నారని రజ్నా ఆవేదన వ్యక్తం చేసింది. నిరంతరం ఎగతాళి చేసి హింసించి ఆత్మహత్యకు పురిగొల్పిన విద్యార్థులు చివరకు అతడి మరణాన్ని కూడా సెలబ్రేట్ చేసుకున్నారని ఆమె ఆరోపించింది. దీనికి సంబంధించిన వాట్సాప్ మెసేజ్‌ల స్క్రీన్ షాట్‌లను షేర్ చేసింది. ఈ ఆధారాలతో తక్షణం, నిష్పాక్షిక దర్యాప్తు జరుపాలని ఆమె కోరింది. సీఎం కార్యాలయంతోపాటు డీజీపీకి ఈ మేరకు ఫిర్యాదు లేఖను మిహిర్ తల్లిదండ్రులు అందజేశారు.


# కుంభమేళాలో వండుతున్న ఆహారంలో మట్టి పోసిన పోలీస్ అధికారి



**లక్నో:** ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో మహా కుంభమేళా జరుగుతున్నది. త్రివేణి సంగమంలో పవిత్ర స్నానాల కోసం అక్కడకు వస్తున్న లక్షలాది భక్తుల కోసం కొన్ని స్వచ్ఛంధ సంస్థలు ఆహారాన్ని సరఫరా చేస్తున్నాయి. అయితే ఒక పోలీస్ అధికారి దారుణంగా ప్రవర్తించాడు. ఒకచోట వండుతున్న ఆహారంలో మట్టిపోశాడు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ప్రయాగ్‌రాజ్‌లో ఆహారాన్ని తయారు చేసే 'భండారా' వద్ద ఈ సంఘటన జరిగింది. ఇటుకల పొయ్యిపై పెట్టిన పెద్ద పాత్రల్లో కొందరు వ్యక్తులు ఆహారం వండుతున్నారు. ఇంతలో ఒక పోలీస్ అధికారి అక్కడకు వచ్చాడు. వండుతున్న ఆహార పాత్రలోకి మట్టి వేశాడు. కాగా, ఉత్తరప్రదేశ్‌లో ప్రధాన ప్రతిపక్షమైన సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ ఈ వీడియో క్లిప్‌ను సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. 'మహా కుంభమేళాలో చిక్కుకున్న వారికి ఆహారం, నీరు అందించడానికి ఏర్పాట్లు చేస్తున్న వారి మంచి ప్రయత్నాలు, రాజకీయ శత్రుత్వం కారణంగా విఫలమవడం దురదృష్టకరం. ప్రజలు గమనించాలి' అని అందులో పేర్కొన్నారు.

మరోవైపు ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. దీంతో ఆహారం తయారు చేస్తున్న పాత్రలో మట్టి పోసిన పోలీస్ అధికారిని సోరాన్ పోలీస్ స్టేషన్ ఇన్‌చార్జ్ బ్రిజేష్ తివారీగా గుర్తించారు. ఆయనను సస్పెండ్ చేసినట్లు పోలీస్ ఉన్నతాధికారులు తెలిపారు.

# తండ్రితో సంబంధం ఉందన్న అనుమానంతో.. మహిళను పొడిచి చంపిన బాలుడు





**కోల్‌కతా:** తన తండ్రితో ఒక మహిళకు వివాహేతర సంబంధం ఉందని ఒక బాలుడు అనుమానించాడు. తల్లి, మరో వ్యక్తితో కలిసి టీ స్టాల్ వద్దకు వచ్చాడు. తండ్రితో కలిసి టీ తాగుతున్న ఆ మహిళను కత్తితో పొడిచి చంపాడు. పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలో ఈ సంఘటన జరిగింది. జనవరి 30న రాత్రి 8 గంటల సమయంలో ఈఎం బైపాస్‌లోని ప్రముఖ టీ షాప్ వద్ద ఒక వ్యక్తి, 24 ఏళ్ల మహిళ కలిసి టీ తాగుతున్నారు. కాగా, ఆ వ్యక్తి కుమారుడైన 16 ఏళ్ల బాలుడు తన తల్లి, మరొకరితో కలిసి అక్కడకు వచ్చాడు. తన తండ్రి, కలిసి టీ తాగుతున్న మహిళ మధ్య వివాహేతర సంబంధం ఉందని అనుమానించాడు. కత్తితో ఆమెపై దాడి చేశాడు. అక్కడి నుంచి పారిపోయేందుకు ప్రయత్నించిన ఆ మహిళను వెంబడించి పలుమార్లు పొడిచాడు. తీవ్రంగా గాయపడిన ఆమెను ఆసుపత్రికి తరలించారు. అయితే చికిత్స పొందుతూ శుక్రవారం మరణించింది. మరోవైపు ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మహిళను కత్తితో పొడిచిన మైనర్ బాలుడ్ని అదుపులోకి తీసుకున్నారు. అతడి తల్లితోపాటు వెంట వచ్చిన మరో వ్యక్తిని అరెస్ట్ చేశారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# లోక్‌సభ ఎన్నికల్లో..

## రూ.1,737 కోట్లకుపైగా ఖర్చు చేసిన బీజేపీ



**న్యూఢిల్లీ:** గత ఏడాది జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో రూ.1,737.68 కోట్లను బీజేపీ ఖర్చు చేసింది. పార్టీ ప్రచారానికి రూ.884.45 కోట్లు వ్యయం చేయగా, అభ్యర్థుల ఖర్చుల కోసం రూ.853.23 కోట్లు కేటాయించింది. 2024 లోక్‌సభ ఎన్నికల వ్యయం నివేదికను ఎన్నికల సంఘం(ఈసీ)కు బీజేపీ సమర్పించింది. పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రకటనలు, బల్క్ ఎస్ఎంఎస్ ప్రచారాలు, కేబుల్, వెబ్‌సైట్స్, టీవీ ఛానెళ్లలో ప్రమోషనల్ కంటెంట్‌తో సహా మీడియా ప్రకటనల కోసం మొత్తంగా రూ.611.50 కోట్లు ఖర్చు చేసినట్లు ఆ రిపోర్ట్‌లో పేర్కొంది. కాగా, సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ పోస్టర్లు, బ్యానర్లు, హోర్డింగ్‌లు, జెండాలు వంటి ప్రచార సామగ్రి కోసం రూ. 55.75 కోట్లు బీజేపీ ఖర్చు చేసింది. అలాగే బహిరంగ సభలు, ఊరేగింపులు, ప్రచార సభలు, వేదికల ఏర్పాట్లు, ఆడియో సెటప్‌లు, బారికేడ్లు, వాహనాల కోసం అదనంగా రూ.19.84 కోట్లు వినియోగించింది. మరోవైపు ఎన్నికల ప్రచారానికి సంబంధించిన ప్రయాణ ఖర్చులను కూడా ఆ నివేదికలో బీజేపీ పేర్కొంది. స్టార్ క్యాంపెయినర్ల ప్రయాణ ఖర్చు రూ.168.92 కోట్లు, ఇతర పార్టీ నాయకుల ప్రయాణానికి రూ. 2.53 కోట్లు ఖర్చు చేసినట్లు వెల్లడించింది. కాగా, సార్వత్రిక ఎన్నికలతోపాటు అసెంబ్లీ ఎన్నికలు జరిగిన అరుణాచల్ ప్రదేశ్‌లో రూ. 5,552.57 కోట్లు, సిక్కింలో రూ. 5,552.41 కోట్లు, ఒడిశాలో రూ.5,555.65 కోట్లు ఖర్చు చేసినట్లు బీజేపీ పేర్కొంది. దీంతో కేంద్రంలో మూడోసారి అధికారంలోకి రావడంతోపాటు ఆయా రాష్ట్రాల్లో గెలుపు కోసం బీజేపీ ప్రధానంగా ప్రచారంపై ఆధారపడినట్లు ఈ ఖర్చుల నివేదిక ద్వారా తెలుస్తున్నది.

# కుంభమేళా కోసం రైలు ఎక్కలేకపోయిన వ్యక్తి.. రైల్వేపై 50 లక్షల పరిహారం

**పాట్నా:** తన కుటుంబంతో కలిసి కుంభమేళాకు వెళ్లేందుకు ఒక వ్యక్తి ట్రైన్ టిక్కెట్లు బుక్ చేసుకున్నాడు. అయితే రైల్వే అధికారుల నిర్లక్ష్యం వల్ల రైలు ఎక్కలేకపోయాడు. ఈ నేపథ్యంలో టిక్కెట్ల డబ్బు వాపస్ కోసం డిమాండ్ చేశాడు. గడువులోగా వడ్డీతో చెల్లించని పక్షంలో 50 లక్షల పరిహారం ఇవ్వాలని రైల్వేకు నోటీస్ పంపాడు. ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో మహా కుంభమేళా జరుగుతున్నది. బీహార్‌లోని ముజఫర్‌పూర్ జిల్లా గైఘాట్ పోలీస్ స్టేషన్ ప్రాంతానికి చెందిన జనక్ కిషోర్ ఝా అలియాస్ రాజన్ తన కుటుంబంతో కలిసి కుంభమేళాకు వెళ్లేందుకు సిద్ధమయ్యాడు. దీని కోసం ఏసీ 3 కోచ్‌లో టిక్కెట్లు బుక్ చేసుకున్నాడు. జనవరి 26న స్వతంత్ర సేనాని ఎక్స్‌ప్రెస్ ఎక్కేందుకు స్టేషన్‌కు చేరుకున్నాడు. అయితే ఏసీ కోచ్ డోర్ లోపలి నుంచి లాక్ చేసి ఉంది. దీంతో రైల్వే సిబ్బంది సహాయాన్ని కోరాడు. ఎవరూ పట్టించుకోకపోవడంతో కుంభమేళాకు వెళ్లేందుకు ఆ రైలు ఎక్కలేకపోయారు. కాగా, రైల్వే నిర్లక్ష్యం కారణంగా 144 ఏళ్ల తర్వాత జరుగుతున్న మహా కుంభమేళాకు తాను, తన కుటుంబం వెళ్లలేకపోవడంపై కిషోర్ ఝా ఆవేదన వ్యక్తం చేశాడు. మతపరంగా ప్రాముఖ్యత కలిగిన మహా కుంభమేళాకు హాజరయ్యే అవకాశాన్ని కోల్పోవడం ఆర్థికంగానే కాక మానసికంగా, ఆధ్యాత్మికంగా కూడా బాధ కలిగిందని వాపోయాడు. ఈ నేపథ్యంలో టిక్కెట్ల మొత్తాన్ని 15 రోజుల్లోపు వడ్డీతో సహా చెల్లించాలని రైల్వేను కిషోర్ ఝా కోరాడు. లేనిపక్షంలో రూ.50 లక్షల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశాడు. న్యాయవాది ద్వారా రైల్వే బోర్డు ఛైర్మన్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌కు ఈ మేరకు నోటీస్ పంపాడు. రైల్వే స్పందించకపోతే వినియోగదారుల రక్షణ చట్టం కింద సేవా లోపం ఆరోపణలపై సంబంధిత కోర్టును ఆశ్రయిస్తామని ఆయన తరుపు న్యాయవాది హెచ్చరించారు.

మహా పత్రిక
WWW.MAHAADAILY.COM | సినిమా వార్తలు | MOVIE NEWS | శనివారం, హైదరాబాద్ | 01-02-2025
ANN తెలుగు








అక్కినేని నాగార్జున నటించిన మన్మథుడు సినిమాతో హీరోయిన్‌గా సూపర్ ఫేం సంపాదించింది అన్షు . ఈ భామ లాంగ్ గ్యాప్ తర్వాత మళ్లీ తెలుగు సినిమాలో నటిస్తుందని తెలిసిందే. టాలీవుడ్ యాక్టర్ సందీప్ కిషన్ ధమాకా ఫేం త్రినాథరావు నక్కిన దర్శకత్వంలో నటిస్తోన్న చిత్రం మజాకా. ఈ చిత్రంలో రీతూ వర్మ హీరోయిన్‌గా నటిస్తుండగా.. రావు రమేశ్, అన్షు మరో కీలక పాత్రల్లో నటిస్తున్నారు. తాజాగా అన్షు కు పుట్టినరోజు

## పెళ్లి కూతురైన మన్మథుడు హీరోయిన్ అన్షు..
# స్పెషల్ లుక్‌తో సూపర్ హైప్

శుభాకాంక్షలు తెలియజేస్తూ ఈ మూవీ లుక్ ఒకటి విడుదల చేశారు మేకర్స్. ఇందులో అన్షు ను స్టైలిష్ గాగుల్స్ పెట్టుకున్న పెళ్లికూతురు గెటప్‌లో చూడొచ్చు. ఈ లుక్ నెట్టింట వైరల్ అవుతూ సినిమాపై క్యూరియాసిటీ పెంచేస్తుంది. మాస్ ఎంటర్‌టైనర్‌గా వస్తోన్న మజాకా ఫిబ్రవరి 21న విడుదల కానుంది. ఈ మూవీని ఏకే ఎంటర్ టైన్ మెంట్స్, హాస్య మూవీస్, జీ స్టూడియోస్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఇప్పటికే విడుదల చేసిన మజాకా టైటిల్, ఫస్ట్ లుక్‌లో సందీప్ కిషన్ పంచె కట్టులో సరికొత్తగా కనిపిస్తూ సినిమాపై ఆసక్తిని పెంచుతున్నాడు. ఇటీవలే విడుదల చేసిన బ్యాచిలర్స్ ఆంథెమ్ సాంగ్‌కు మంచి స్పందన వస్తోంది. ఇక హీరోహీరోయిన్లు స్టేషన్‌లో ఉన్న సీన్లతో మొదలైన టీజర్.. అక్కడ పోసుకున్నది బీరు కాదండి.. నా ఉసురు అని సందీప్ కిషన్ అంటుంటే.. నాకు తెలియక అడుగుతున్నాను బీర్ బెటరా.. విస్కీ బెటరా అని అడుగుతోంది రీతూవర్మ.




## విజయ్ దేవరకొండ కొత్త సినిమా
# టైటిల్ ఇదేనా.?

రౌడీ హీరో విజయ్ దేవరకొండ, జెర్సీ ఫేమ్ గౌతమ్ తిన్ననూరి కాంబినేషన్ లో ఓ సినిమా తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. ‘వీడీ12’ అనే వర్కింగ్ టైటిల్‌తో ఈ ప్రాజెక్ట్ రానుండగా విజయ్ దేవరకొండ కెరీర్‌లోనే అత్యంత భారీ బడ్జెట్‌తో ఈ సినిమా తెరకెక్కుతుంది. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్-శ్రీకర స్టూడియోస్ బ్యానర్ సంయుక్తంగా తెరకెక్కిస్తుండగా.. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నాడు. అయితే ఈ మూవీ టైటిల్‌కి సంబంధించి నిర్మాత నాగవంశీ నేడు ఒక పోస్ట్ పెట్టాడు. మీ అందరి (విజయ్ అభిమానుల) నిందల తర్వాత.. నేను గౌతమ్‌ను చాలా హింస పెట్టాక.. ఫైనల్‌గా టైటిల్‌ను లాక్ చేశాం. వీడీ 12 టైటిల్ త్వరలోనే వెల్లడిస్తామని నాగవంశీ ట్వీట్ చేశాడు. అయితే నాగవంశీ ప్రకటించడమే ఆలస్యం ఈ సినిమా టైటిల్ ఇదే అంటూ సోషల్ మీడియాలో ఒక పేరు హల్చల్ చేస్తోంది. ఈ సినిమాకు సామ్రాజ్యం అనే టైటిల్ ఖరారు చేసినట్లు తెలుస్తుంది. తన సామ్రాజ్యం కోసం విజయ్ ఏం చేశాడు.. ? అనే స్టోరీతో ఈ మూవీ రాబోతున్నట్లు తెలుస్తుంది. ఇక ఈ మూవీ టైటిల్ చాలా కొత్తగా ఉందని ఫ్యాన్స్ చెప్పుకొస్తున్నారు. మరోవైపు ఈ చిత్రంలో పోలీస్‌తో పాటు ఖైదీగా విజయ్ నటిస్తున్నాడని వార్తలు వస్తున్నాయి.

# ముగిసిన పరాశక్తి వివాదం

గత రెండు రోజులుగా తమిళ ఇండస్ట్రీలో పరాశక్తి అనే టైటిల్ వివాదం హాట్ టాపిక్ అయిన సంగతి తెలిసిందే. ఒకేరోజు ఇద్దరు స్టార్ నటులు తమ సినిమా టైటిల్‌ను పరాశక్తి అని ప్రకటించారు. ఇందులో శివకార్తికేయన్ సినిమాతో పాటు విజయ్ ఆంటోని సినిమా ఉంది. ఆకాశం నీ హద్దురా లాంటి సూపర్ హిట్ అందుకున్న దర్శకురాలు సుధా కొంగర తన తదుపరి చిత్రం శివ కార్తికేయన్‌తో తీయబోతుంది. మొదట ఈ సినిమాలో హీరోగా సూర్యని అనుకున్నారు. కానీ అనుకొని కారణాలతో ఈ ప్రాజెక్ట్ క్యాన్సిల్ అయ్యింది. ఇప్పుడు అదే ప్రాజెక్ట్‌ను సుధా శివ కార్తికేయన్‌తో తెరకెక్కించబోతుంది. అధర్వ, జయం రవి, శ్రీలీల ఈ సినిమాలో కీలక పాత్రల్లో నటిస్తున్నారు. రీసెంట్‌గా ఈ మూవీ టైటిల్ టీజర్‌ను విడుదల చేశారు మేకర్స్. అయితే ఈ సినిమాకు శివాజి గణేషన్ నటించిన బ్లాక్ బస్టర్ చిత్రం పరాశక్తి అనే టైటిల్ పెట్టారు. అయితే ఈ మూవీ టైటిల్ ప్రకటించిన కాసేపటికే బిచ్చగాడు సినిమాతో తెలుగులో గుర్తింపు తెచ్చుకున్న నటుడు విజయ్ ఆంటోనితన కొత్త సినిమా టైటిల్‌ను ప్రకటించాడు. తమిళంలో తిరుమగన్అనే టైటిల్ పెట్టిన విజయ్ తెలుగులో పరాశక్తి అంటూ పోస్టర్‌ను విడుదల చేశారు. దీంతో ఒకేరోజు రెండు కొత్త సినిమాలు ఒకే టైటిల్‌తో రావడంతో కోలీవుడ్ ఇండస్ట్రీలో పెద్ద వివాదం చెలరేగింది. దీనిపై నటుడు విజయ్ ఆంటోని కూడా క్లారిటీ ఇస్తూ.. తెలుగులో పరాశక్తి అనే టైటిల్‌ను నేను గత ఏడాది జూలైలోనే రిజిస్టర్ చేయించుకున్నానని తెలిపాడు. దీంతో పరాశక్తి టైటిల్ విజయ్ ఆంటోనికే చెల్లుతుందని అంతా అనుకున్నారు. కానీ ఇంతలోనే పరాశక్తి టైటిల్‌ను వదిలేసుకుంటున్నట్లు విజయ్ అంటోని టీం ప్రకటించింది. దిగ్గజ నటుడు శివాజీ గణేషన్ నటించిన పరాశక్తి చిత్రం 73 ఏండ్ల క్రితం విడుదలై ఇప్పటికి అభిమానుల ఆదరణ పొందుతోంది. ఈ చిత్రాన్ని ఏవీఎం సంస్థ నిర్మించింది. అయితే ఈ టైటిల్‌ను శివ కార్తికేయన్ సినిమాకు ఇవ్వడానికి ఒప్పుకున్నట్లు విజయ్ ఆంటోని ప్రకటించాడు. తెలుగులో తన సినిమా టైటిల్‌ను మార్చబోతున్నట్లు తెలిపాడు.

# క్రీడా వార్తలు | SPORTS NEWS



## సచిన్‌కు లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు
### .. ప్రకటించిన బీసీసీఐ

**మహా, స్పోర్ట్స్ డెస్క్:** టీమిండియా దిగ్గజ క్రికెటర్, మాజీ కెప్టెన్ సచిన్ టెండూల్కర్‌కు బీసీసీఐ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డును ప్రకటించింది. శనివారం బీసీసీఐ వార్షిక కార్యక్రమంలో సచిన్‌ను అవార్డుతో సత్కరించనున్నది. సీకే నాయుడు లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డుకు సచిన్‌ను ఎంపిక చేసినట్లు బీసీసీఐ వర్గాలు తెలిపాయి. భారత క్రికెట్‌కు దిగ్గజ ఆటగాడు అందించిన సేవలు అమోఘమని పేర్కొన్నాయి. ఈ పురస్కారాన్ని స్వీకరించనున్న 31వ ఆటగాడు సచిన్ టెండూల్కర్ కావడం విశేషం. గతంలో మాజీ హెడ్‌కోచ్ రవిశాస్త్రి, లెజెండరీ వికెట్ కీపర్ ఫరూక్ ఇంజినీర్ సహా పలువురు ఈ అవార్డును అందుకున్నారు. 1994లో భారత జట్టు తొలి కెప్టెన్ కర్నల్ సీకే నాయుడు గౌరవార్థం ఈ అవార్డును బీసీసీఐ తీసుకువచ్చింది. సీకే నాయుడు 1916 నుంచి 1963 వరకు సుదీర్ఘంగా 47 సంవత్సరాల పాటు ఫస్ట్‌క్లాస్‌లో కొనసాగారు. ఇది ప్రపంచ రికార్డు కావడం విశేషం.

## ఫైనల్‌లో యువ భారత్.. ఫిబ్రవరి 2న దక్షిణాఫ్రికాతో టీమిండియా ఫైట్..!

కౌలాలంపూర్ వేదికగా జరిగిన అండర్19 వుమెన్స్ టీ20 ప్రపంచకప్‌లో యువ భారత్ ఫైనల్‌లోకి ప్రవేశించింది. ఇంగ్లాండ్‌తో జరిగిన రెండో సెమీ ఫైనల్‌లో ఇంగ్లాండ్‌ను తొమ్మిది వికెట్ల తేడాతో టీమిండియా ఓడించింది. 114 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన టీమిండియా.. మరో ఐదు ఓవర్లు మిగిలి ఉండగానే.. ఘన విజయం సాధించింది. ఫిబ్రవరి 2న ఆదివారం దక్షిణాఫ్రికాతో టీమిండియా తలపడనున్నది.

మొదట బ్యాటింగ్ చేసిన ఇంగ్లాండ్.. నిర్ణీత 20 ఓవర్లలో ఎనిమిది వికెట్ల నష్టానికి 113 పరుగులు చేసింది. టీమిండియా బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేసి ఇంగ్లిష్ జట్టును తక్కువ స్కోర్‌కే పరిమితం చేశారు. ఆ తర్వాత బరిలోకి దిగిన టీమిండియా వికెట్ నష్టపోయి 15 ఓవర్లలోనే 117 పరుగులు చేసి ఫైనల్‌లోకి అడుగుపెట్టింది. లక్ష్య చేధనలో కమలినిత్రిష జోడీ టీమిండియాకు మంచి శుభారంభం అందించింది. ఇద్దరు తొలి వికెట్‌కు 60 పరుగుల భాగస్వామ్యాన్ని నెలల్పారు. ఫోబ్ బ్రెట్ బౌలింగ్ త్రిష అవుట్ అయ్యింది. 29 బంతుల్లో 35 పరుగులు చేసింది. త్రిష తొలి సూపర్ సిక్స్ మ్యాచ్‌లో సెంచరీ చేసిన తొలి బ్యాట్స్‌వుమెన్‌గా నిలిచింది. ఆ తర్వాత కమలిని, సానిక చల్కే జోడీ టీమిండియా విజయాన్ని ఖరారు చేశారు. భారత్ ఐదు ఓవర్లు మిగిలి ఉండగానే విజయం సాధించింది. కమలిని 50 బంతుల్లో 56 పరుగులతో రాణించింది. సానికా 12 బంతుల్లో ఒక ఫోర్ సహాయంతో 11 పరుగులు చేసి అజేయంగా నిలిచింది.

ఇంగ్లాండ్ టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్ ఎంచుకుంది. దేవినా పెర్రిన్, కెప్టెన్ అబి నార్గ్రోవ్ తప్ప ఇతర బ్యాటర్స్ రాణించలేకపోయారు. పెర్రిన్ 40 బంతుల్లో ఆరు ఫోర్లు, రెండు సిక్సర్లతో 45 పరుగులు చేయగా, నార్గ్రోవ్ 25 బంతుల్లో మూడు ఫోర్లు, ఓ సిక్సర్‌తో 30 పరుగులు చేసింది. పారుణిక సిసోడియా, వైష్ణవి శర్మ బంతితో ఆకట్టుకున్నారు. ఇద్దరు చెరో మూడు వికెట్ల పడగొట్టారు. ఆయుషి శుక్లాకు రెండు వికెట్లు దక్కాయి.



# విరాట్ విఫలం..
## 6 రన్స్‌కే క్లీన్‌బౌల్డ్



**న్యూఢిల్లీ:** పుష్కరకాలం తర్వాత దేశవాళీలో పునరాగమనం చేసిన టీమ్ఇండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి తీవ్ర నిరాశపరిచాడు. రంజీ మ్యాచ్‌లో రైల్వేస్‌తో జరుగుతున్న మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యాడు. యశ్ ధూల్ ఔట్ కావడంతో సెకండ్ డౌన్‌లో క్రీజ్‌లోకి వచ్చిన కోహ్లి కేవలం 6 పరుగులు చేసి పెవిలియన్‌కు వెనుతిరిగాడు. స్వంగ్వాన్ బౌలింగ్‌లో క్లీన్‌బౌల్డ్ అయ్యాడు. దీంతో విరాట్ బ్యాటింగ్ చూడ్డానికి వచ్చిన ఫ్యాన్స్‌ను నిరాశపరిచాడు. అంతకుముందు విరాట్‌ను చూసేందుకు వచ్చిన ప్రేక్షకులతో స్టేడియం పూర్తిగా నిడింపోయింది. కోహ్లి బ్యాంటింగ్‌కు వస్తుండగా అభిమానులు నినాదాలతో హోరెత్తించారు. అయితే తక్కువ రన్స్‌కే ఔటవడంతో నిరాశతో స్టేడియం నుంచి వెనుతిరిగారు. కాగా, ఢిల్లీ వెంటవెంటనే 4 వికెట్లు కోల్పోవడంతో చిక్కులో పడింది. ప్రస్తుతం 30 ఓవర్లు ముగిసే సరికి 101 రన్స్ చేసింది. మరో 140 పరుగులు వెనకపడి ఉంది.

## వచ్చే నెల 16న ప్రారంభ వేడుకలు

**కరాచీ:** పాకిస్థాన్, దుబాయ్ వేదికలుగా జరుగబోయే ప్రతిష్టాత్మక ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీలో వచ్చే నెల 16న ప్రారంభ వేడుకలు జరుగనున్నాయి. ఈ టోర్నీలో.. 16న లాహోర్‌లో ఓపెనింగ్ సెర్మనీని నిర్వహించనున్నట్టు పీసీబీ ప్రతినిధి ఒకరు తెలిపారు. లాహోర్‌లోని హుజూరి బాగ్ కోటలో ఈ వేడుకలు జరుగనున్నాయి. అయితే టోర్నీకి ముందు కెప్టెన్ల ఫొటోషూట్ లేదని పీసీబీ అధికార వర్గాలు పేర్కొన్నాయి.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com